www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 189 గురువారం, నవంబర్ 26, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

పౌల్ట్రీ రంగానికి పెద్దపీట..

పరిశ్రమలకు ప్రోత్సాహం

- సింగిల్ విండో విధానంలో అనుమతులు.. ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపునకు హామీ
- దాణా కోసం సోయా, మొక్కజొన్న సరఫరా సమస్యకు 48 గంటల్లో పరిష్కారం

హైదరాబాద్,నవంబర్ 25 : తెలంగాణలో ఐటీ రంగంతో పాటు పౌల్ట్రీ పరిశ్రమను కూడా ప్రాధాన్యతా రంగంగా గుర్తించి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తు చేసుకుంటే ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు భూముల కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ప్రారంభమైన పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో2026లో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. గత 18 ఏళ్లుగా హైదరాబాద్‌లో పౌల్ట్రీ ప్రదర్శన నిర్వహించడం, ప్రతి సంవత్సరం ఈ రంగం విస్తరిస్తుండటం అభినందనీయమన్నారు. వ్యవసాయ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ రైతుల ఆర్థిక పరిస్థితి



మెరుగుపడటంలో పౌల్ట్రీ పరిశ్రమ

మిగతా2లో...



రూ.19,934 కోట్ల ప్రాజెక్టులకు

కేంద్రం ఆమోదం

- దేశీయ తయారీకి రూ.11 వేల కోట్లు..
- తమిళనాడులో కొత్త కంటైనర్ టెర్మినల్, అసోంలో విమానాశ్రయం

న్యూఢిల్లీ,నవంబర్ 25 : దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక తయారీ, రవాణా రంగాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రూ. 19,934 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. **దేశీయ తయారీకి ప్రోత్సాహం** నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు ఎనిమిదేండ్ల కాలపరిమితితో రూ. 11 వేల కోట్ల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. టన్నెల్ బోరింగ్ యంత్రాలు, ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు, భారీ ట్రక్కులు, లోడర్లు, డ్రిల్లింగ్ యంత్రాల తయారీకి ప్రోత్సాహకాలు అందించనున్నారు. దిగుమతులపై

మిగతా2లో...



బడా బాకీలకు బ్యాంకుల ఊరట

పదేళ్లలో రూ.18 లక్షల కోట్ల రుణాల రద్దు!

ఐదేళ్లలో తిరిగి వసూలైంది కేవలం 13 శాతమే..

టాప్-10 బ్యాంకుల వాటా రూ.11.73 లక్షల కోట్లు

న్యూఢిల్లీ,నవంబర్ 25 : బడా కార్పొరేట్ సంస్థలు, వ్యాపారులు తీసుకున్న మొండి రుణాల విషయంలో బ్యాంకులు భారీగా రైట్‌ఆఫ్ చేస్తున్నాయి.

మిగతా2లో...

తెలంగాణ వ్యవసాయానికి

జర్మనీ చేయూత

- ఆధునిక పరిజ్ఞానం, పరిశోధన, ఆహార శుద్ధి రంగాల్లో ఉమ్మడి కార్యాచరణకు సిద్ధం



హైదరాబాద్,నవంబర్ 25 : తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు జర్మనీ సంసిద్ధత వ్యక్తం చేసింది. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పరిశోధన, పెట్టుబడులు, వాణిజ్య సంబంధాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని జర్మనీ ప్రతినిధి బృందం వెల్లడించింది. బుధవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో బృందం సమావేశమైంది. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అందించడంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఆహార నిల్వ సదుపాయాలు,

మిగతా2లో...



పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా

జాబితా విడుదల

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కలిపి 11.89 లక్షల మంది ఓటర్లు.. డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలకు అవకాశం

హైదరాబాద్,నవంబర్ 25 : రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,68,105 మంది, వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గంలో 6,21,086 మంది కలిపి

మిగతా2లో...

యువత క్రీడా భవిష్యత్తుకు

రూ.120 కోట్ల బాట

ప్రపంచస్థాయి వసతులతో స్టేడియాల అభివృద్ధి..

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



2లో



దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా

పంజాగుట్ట

ఫిర్యాదు నుంచి ఛార్జిషీట్ వరకు అన్నీ కృత్రిమ మేధతోనే.. పనులను పరిశీలించిన డీజీపీ, నగర పోలీస్ కమిషనర్

బంజారాహిల్స్,నవంబర్ 25 : పోలీసు వ్యవస్థలో సాంకేతిక విప్లవానికి హైదరాబాద్ వేదికగా నిలవనుంది. దేశంలోనే తొలి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట ఠాణా రూపుదిద్దుకుంటోంది. ఫిర్యాదుల స్వీకరణ నుంచి దర్యాప్తు, ఛార్జిషీట్ తయారీ వరకు పోలీసు సేవలను ఏఐ పరిజ్ఞానంతో అనుసంధానించేందుకు అధికారులు చర్యలు చేపడుతు న్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా

మిగతా2లో...

రాజ్యాంగ పరిరక్షణకు

భారీ ర్యాలీ

సంవిధాన్ రక్షా మార్చ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

పౌల్ట్రీ రంగానికి పెద్దపీట.. పరిశ్రమలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. **పరిశ్రమలకు సులభతర అనుమతులు** ఫ్యూచర్ సిటీలో బిల్ట్‌నౌ యాప్ ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నామని సీఎం తెలిపారు. త్వరలో ఈ విధానాన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు కూడా విస్తరిస్తామని చెప్పారు. పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ రంగంలో అప్పుడప్పుడు ఒడిదుడుకులు సహజమని, సంక్షోభ సమయాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. **దాణా సరఫరా సమస్యకు పరిష్కారం** పౌల్ట్రీ పరిశ్రమలకు అవసరమైన దాణా, సోయాబీన్, మొక్కజొన్న సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశ్రమ ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై స్పందించిన సీఎం.. సోయా, మొక్కజొన్న సరఫరా సమస్యపై సమీక్ష నిర్వహించి 48 గంటల్లో సానుకూల నిర్ణయం తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆదేశించారు. రాష్ట్రంలో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా జరుగుతోందని, ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్లు, చికెన్ అందిస్తున్నామని తెలిపారు. **చిన్న రైతులకు అండగా ఉంటాం** చిన్న, సన్నకారు పౌల్ట్రీ రైతులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో పౌల్ట్రీ రంగానికి విశేష అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు సరసమైన ధరల్లో పౌష్టికాహారం అందించడంలో కోడిగుడ్లు, చికెన్ కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. పౌల్ట్రీ రంగ నిపుణులు, మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ పరిశ్రమల అభివృద్ధికి భూములు కేటాయించాలని సీఎంను కోరారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను కూడా వివరించారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ ప్రదర్శన విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, రాజ్‌కుమార్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు రూ.100 కోట్ల నిధుల లక్ష్యం

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు అండగా 'హెరిఫ్' ఫౌండేషన్ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 25 : రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కీలక అడుగు వేసింది. వచ్చే ఏడాది కాలంలో రూ.100 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 'హయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (హెరిఫ్)'ను ఏర్పాటు చేసింది.బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు



ప్రకటించారు. సెక్షన్-8 కింద లాభాపేక్షలేని సంస్థగా ఏర్పాటైన ఈ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు నిధుల సమీకరణకు ప్రత్యేక వేదిక అందుబాటులోకి రానుందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం లో దేశవ్యాప్తంగా సుమారు 30 వేల కంపెనీలు రూ.40,794 కోట్ల సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయగా, అందులో రూ.13,877 కోట్లు విద్యారంగానికి కేటాయించాయని వివరించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో తెలంగాణ రూ.1,445.78 కోట్లతో దేశంలో తొమ్మిదో స్థానంలో ఉందన్నారు.ఈ నిధుల సమీకరణలో భాగంగా జనవరి 8 లేదా 9 తేదీల్లో 100 కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలోని ఉన్నత విద్య, పరిశోధన, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం,

యువత క్రీడా భవిష్యత్తుకు రూ.120 కోట్ల బాట

హైదరాబాద్,నవంబర్ 25 : తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేసి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో జరగనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.**స్టేడియాలకు కొత్త రూపు** ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.21 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.203 కోట్లు ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. ఇందులో రూ.120 కోట్లతో స్టేడియాల్లో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఆధునిక క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోటీలు ముగిసిన తర్వాత కూడా ఈ వసతులు రాష్ట్ర క్రీడాకారులకు ఉపయోగపడేలా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు పోటీలు జరిగే ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు బాధ్యతలు తీసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఎల్బీ స్టేడియంలో ప్రారంభ వేడుకలు, గచ్చిబౌలి స్టేడియంలో ముగింపు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

నాణ్యతలో రాజీ వద్దు

స్టేడియాల ఆధునీకరణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. 27 క్రీడాంశాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే 861 మంది తెలంగాణ క్రీడాకారులు, కోచ్‌లకు ప్రత్యేక క్రీడా సామగ్రి అందించనున్నారు. రాష్ట్ర సంప్రదాయ యుద్ధకళ కర్రసామును తొలిసారిగా ప్రదర్శన క్రీడగా చేర్చడం విశేషం. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట

(మొదటి పేజీ తరువాయి)

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో చేపడుతున్న పనులను డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేశ్ మురళీధర్ భగవత్ బుధవారం పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, ఏఐ వ్యవస్థ ద్వారా వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు? పరిష్కార ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది? అనే వివరాలను తెలుసుకున్నారు.ఏఐ సాంకేతికత సాయంతో పోలీసులు విధులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించడంతోపాటు స్టేషన్‌లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. సాంకేతికతను వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా ప్రజలకు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ఏఐ ఆధారిత పోలీస్ స్టేషన్‌ను త్వరలోనే పైలట్ ప్రాజెక్టుగా అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ పరిశీలనలో అడిషనల్ డీజీపీ అకున్ సభర్వాల్, హైదరాబాద్ అడిషనల్ సీపీ ఎం.శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు భారీ ర్యాలీ

హైదరాబాద్, నవంబర్ 25 :

రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించే 'సంవిధాన్ రక్షా మార్చ్'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐసీసీ పిలుపు మేరకు గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.గురువారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం (లిబర్టీ) నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన జరగనుంది. ఏఐసీసీ ఇన్‌చార్జి బి.ఎం.సందీప్‌కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు.

జోగిపేట ఎస్సీ హాస్టల్‌లో కలుషిత ఆహారం

● పులిహోర తిని ఏడుగురు విద్యార్థినులకు అస్వస్థత..

చికిత్స అనంతరం ప్రమాదం లేదన్న వైద్యులు

జోగిపేట,నవంబర్ 25 :

సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం అల్పాహారంగా పులిహోర తిని కళాశాలలకు వెళ్లిన కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో ఇబ్బందిపడ్డారు.అస్వస్థతకు గురైన స్వప్న, శశికళ, నవిత, శైలజ, జ్ఞానేశ్వరి, దీపిక, గంగోత్రిలను తోటి విద్యార్థులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.విషయం తెలుసుకున్న ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎస్ఐ గిరి శ్రీకాంత్ హాస్టల్‌ను సందర్శించి వంటగదిని, ఆహారాన్ని పరిశీలించారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి విద్యార్థినులను పరామర్శించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ ఘటనపై స్పందించిన పలువురు నాయకులు విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.17,934 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచడం ఈ పథకం లక్ష్యం.ఈ పథకం ద్వారా రూ.21 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు రూ.22,500 కోట్ల దిగుమతులకు ప్రత్యామ్నాయంగా దేశీయ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. ఎగుమతులు కూడా నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.**పోర్టు, విమానాశ్రయ అభివృద్ధి** తమిళనాడులోని కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి, అసోంలోని సిల్చార్ సమీపంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. తపాలా సేవల ఆధునీకరణకు రూ.2,632 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిర్ణయాలతో దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి, రవాణా, మౌలిక వసతులకు మరింత ఊతం లభించనుంది.

బడా బాకీలకు బ్యాంకుల ఊరట

(మొదటి పేజీ తరువాయి)

2016-17 నుంచి 2025-26 వరకు పదేళ్లలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఏకంగా రూ.18.08 లక్షల కోట్ల రుణాలను ఖాతాల నుంచి తొలగించాయి. సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైన ఆర్‌బీఐ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఈ రుణాల్లో ఐదేళ్ల కాలంలో తిరిగి వసూలైన మొత్తం కేవలం రూ.1.32 లక్షల కోట్లు మాత్రమే. అంటే మొత్తం రద్దు చేసిన రుణాల్లో సుమారు 13 శాతమే వసూలైంది. 2018-19లో అత్యధికంగా రూ.2.39 లక్షల కోట్ల రుణాలను రైట్‌ఆఫ్ చేశారు. 2025-26లో రుణాల రద్దు 8.2 శాతం తగ్గి రూ.1.44 లక్షల కోట్లకు చేరింది. **టాప్-10 బ్యాంకుల వాటా రూ.11.73 లక్షల కోట్లు** రుణాల రద్దులో తొలి పది బ్యాంకుల వాటా రూ.11.73 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో ఎస్‌బీఐ రూ.3.03 లక్షల కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.1.31 లక్షల కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1.14 లక్షల కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.1.13 లక్షల కోట్లు, కెనరా బ్యాంక్ రూ.1.03 లక్షల కోట్ల రుణాలను రైట్‌ఆఫ్ చేశాయి. **చిన్న రుణగ్రహీతలపై ఒత్తిడి.. పెద్దలకు వెసులుబాటు?** చిన్న మొత్తాల అప్పులు చెల్లించలేని రైతులు, సామాన్యులకు నోటీసులు, జప్తు హెచ్చరికలు జారీ చేస్తున్న బ్యాంకులు.. భారీ రుణాలు తీసుకున్న సంస్థల విషయంలో అనుసరిస్తున్న విధానంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీడియోకాన్, ఫ్యూచర్ గ్రూపు రుణాల వ్యవహారాలు కూడా ఈ చర్చకు కారణమవుతున్నాయి. పెద్ద రుణగ్రహీతల విషయంలోనూ సమానమైన బాధ్యత, జవాబుదారీతనం ఉండాలని, రుణ వసూళ్లలో పేదలు, ధనికుల మధ్య వివక్ష లేకుండా చూడాలని కథనం పేర్కొంది.

తెలంగాణ వ్యవసాయానికి జర్మనీ చేయూత

(మొదటి పేజీ తరువాయి)

పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ రంగాల్లో సహకారం అందించేందుకు జర్మనీ బృందం ఆసక్తి చూపింది. ఈ రంగాల్లో పరస్పర సహకారంతో ఇరు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడింది.తెలంగాణలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని మంత్రి తుమ్మల వివరించారు. జర్మనీకి చెందిన మరిన్ని సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను జర్మనీకి పెంచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భారత్-జర్మనీ మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని జర్మనీ ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జర్మనీ రాయబార కార్యాలయ వ్యవసాయ, ఆహార విభాగం అధిపతి వోల్కర్ క్లిమా, డాక్టర్ ఆండ్రియాస్ గ్రామ్‌జో, సబ్రినా లాండ్‌మన్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 11,89,191 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు.**డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు** ముసాయిదా జాబితాపై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించనున్నారు. అర్హులైన పట్టభద్రులు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. పేర్లు లేకపోతే ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 వినియోగించాలి.**డిసెంబర్ 30న తుది జాబితా** రెండు నియోజకవర్గాల పరిధిలో 1,703 పోలింగ్ కేంద్రాలను ఆమోదించారు. సంబంధిత జిల్లాల్లోని ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాల్లో ముసాయిదా జాబితాలు అందుబాటులో ఉంటాయి. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. కాగా, రెండు నియోజకవర్గాల్లో కలిపి 80,935 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి.

అండాల అక్రమ సేకరణపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలి

● ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలి.. ఏఆర్టీ చట్టంలో లోపాలను సవరించాలి: గవర్నర్‌కు మహిళా కమిషన్ వినతి



హైదరాబాద్,నవంబర్ 25 : పేద, మధ్యతరగతి మహిళలను ప్రలోభాలకు గురిచేసి అండాలను అక్రమంగా సేకరిస్తున్న వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కోరింది. ఈ అక్రమ వ్యవహారం వెనుక ఉన్న అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌ను వెలికితీసేందుకు ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి చేసింది.మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సభ్యురాలు ఉజ్మా షకీర్ బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఈ అంశంపై వివరించారు. ఈ అక్రమ సేకరణ ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా పలు రాష్ట్రాలకు విస్తరించినందున, దీని వెనుక ఉన్న వ్యక్తులు, వ్యవస్థను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏఆర్టీ) అమలులోని లోపాలను సవరించాలని కమిషన్ సూచించింది. మహిళల హక్కులు, ఆరోగ్యం, భద్రతకు మరింత రక్షణ కల్పించేలా చట్టాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన సవరణలను కేంద్రానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేసింది.ఇప్పటివరకు కమిషన్ చేపట్టిన విచారణ, అధికారుల నుంచి సేకరించిన సమాచారం, పోలీసుల దర్యాప్తు వివరాలను గవర్నర్‌కు వివరించారు. నిందితులకు ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులనూ ప్రస్తావించారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలకు సూచనలు చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు కమిషన్ వెల్లడించింది.

ఏసీబీ అంతర్గత అవినీతిపై ఉక్కుపాదం..

ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు!

- సొంత శాఖ అధికారులైనా ఉపేక్షించేది లేదు..
- మూడుసార్లు పిలిచినా విచారణకు హాజరుకాని ఆరోపణలు చేసిన అధికారి
- ఏసీబీ అధికారులపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ

హైదరాబాద్, క్రైమ్ బ్యూరో
నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :
అవినీతిని అరికట్టాల్సిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన సొంత విభాగంలోని అధికారుల అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేసింది. ఇటీవల మీడియాలో ఏసీబీ అధికారులపై వచ్చిన ఆరోపణలను తెలంగాణ ఏసీబీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు వెల్లడించింది. ఏసీబీ అధికారులు సైతం చట్టానికి, శాఖాపరమైన నిబంధనలకు అతీతులు కారని, తప్పు చేసినట్లు రుజువైతే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ చేత కేసు నమోదైన ఓ అధికారి, మరో ఏసీబీ అధికారిపై చేసిన ఆరోపణలపై ప్రస్తుతం సవివరమైన, నిష్పక్షపాత శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు తెలిపింది. అయితే ఆరోపణలు చేసిన వ్యక్తిని విచారణకు మూడుసార్లు పిలిచినా ఇప్పటివరకు పదేపదే హాజరుకాకపోవడంపై ఏసీబీ ప్రకటనలో పేర్కొంది. విచారణ పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నామని, ఆరోపణలు నిరూపితమైతే సంబంధిత అధికారిపై చట్ట ప్రకారం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

అవినీతిపై పోరాడే సంస్థగా ఏసీబీ ముందుగా తన సొంత విభాగంలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అంతర్గత నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయడం ద్వారా ప్రజల్లో సంస్థపై విశ్వాసాన్ని పెంపొందించవచ్చని వెల్లడించింది. తమ శాఖలోని ఏ అధికారి అవినీతికి పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది.ఏసీబీ అధికారుల దుష్ప్రవర్తన, అవినీతి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన పౌరులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదులను అత్యంత గోప్యతతో పరిశీలిస్తామని, ఫిర్యాదుదారుల గుర్తింపును రహస్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చింది.అవినీతి నిర్మూలనే లక్ష్యంగా రోజుకు 24 గంటలు, వారానికి ఏడు రోజులు, ఏడాదికి 365 రోజులు పనిచేస్తామని ఏసీబీ పునరుద్ఘాటించింది.

బుల్లెట్ బైక్ అదుపుతప్పి ఘోర ప్రమాదం.. యువతి మృతి!

- అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా? డివైడర్‌ను ఢీకొని చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం
- హైటెక్ సిటీలో తెల్లవారుజామున విషాదం.. ఆసుపత్రికి తరలించేలోపే యువతి మృతి



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో
నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :హైటెక్ సిటీలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బుల్లెట్ మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను, అనంతరం చెట్టును ఢీకొనడంతో వెనుక కూర్చున్న 28 ఏళ్ల యువతి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న పెద్దమ్మ టెంపుల్ సమీపంలోని సీఐఐ జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది.
పోలీసుల వివరాల ప్రకారం.. కొతిలి అక్షయ్ కుమార్ (28) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన స్నేహితురాలు సుష్మా చౌదరి (28)తో కలిసి మాదాపూర్‌లోని తన స్నేహితుడు ఉల్లూరి సందీప్ నివాసానికి వెళ్లారు. అక్కడ భోజనం చేసిన అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత బుల్లెట్ మోటార్ సైకిల్ (టూ 31 ఇ 6751)పై సుష్మాను వెనుక కూర్చోబెట్టుకొని కొండాపూర్ వైపు బయలుదేరారు.
ఈ క్రమంలో తెల్లవారుజామున సుమారు 1 గంట సమయంలో సీఐఐ జంక్షన్ వద్దకు చేరుకోగానే మోటార్ సైకిల్ అదుపుతప్పి మొదట రోడ్డు డివైడర్‌ను, అనంతరం మధ్యలో ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న సుష్మా చౌదరి రోడ్డుపై పడిపోయి తలకు, ముఖానికి తీవ్ర గాయాలపాలయ్యారు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికుల సహాయంతో వెంటనే మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో తెల్లవారుజామున 1.25 గంటలకు ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై ఉల్లూరి సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి అతివేగం, నిర్లక్ష్యమే కారణమా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ కొనసాగుతోంది.

జేసీబీతో వచ్చి హడావుడి..

కూల్చివేత దగ్గరకు వచ్చేసరికి అధికారుల వెనకడుగు!

- అక్రమ షెడ్డు యజమాని ముందు టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం చేతులెత్తేసిందా?
- కూల్చివేతకు వెళ్లిన ఏసీపీ సుమిత్ర బృందాన్ని అడ్డుకున్నదెవరు?
- ప్రభుత్వ భూమిని కాపాడలేని అధికార యంత్రాంగం ఎందుకు?
- రాజకీయ పలుకుబడి పేరుతో అధికారుల విధులకు అడ్డంకులా?
- షెడ్డు కూల్చివేత ఆగిపోవడం వెనుక అసలు మతలబేమిటి?
- జేసీబీ వచ్చింది.. అధికారులు వెళ్లారు.. అక్రమ షెడ్డు మాత్రం అలాగే ఉందేంటి?
- కూల్చివేతల పేరుతో హడావుడేనా? తెరవెనుక ముడుపుల వ్యవహారం ఉందా?
- అక్రమ నిర్మాణదారుడితో అధికారులకు ఏమైనా లోపాయికారీ ఒప్పందమా?
- నోటీసులు, తనిఖీలు, హెచ్చరికలకే పరిమితమా? కూల్చివేతలు ఎప్పుడు?
- ప్రభుత్వ భూమిపై ప్రైవేటు పెత్తనం.. టౌన్‌ప్లానింగ్ శాఖ మౌనం వెనుక కారణమేమిటి?
- అధికారుల పర్యటనలతో ప్రయోజనమేమిటి? అక్రమ షెడ్డు తొలగింపుపై చర్యలేవి?
- ఏసీపీ సుమిత్రకు ఉన్నతాధికారుల ప్రశ్నలు తప్పవా? కూల్చివేత ఆగిన తీరుపై విచారణ ఎప్పుడు?
- ఆరోపణలపై మౌనం వీడండి.. నిజానిజాలు ప్రజల ముందుంచండి!



కుత్బుల్లాపూర్, నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులే అక్రమ నిర్మాణదారుల ముందు వెనుకడుగు వేస్తున్నారా? జేసీబీతో కూల్చివేతకు వచ్చి హడావుడి చేయడం.. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెనుదిరగడం వెనుక అసలు కథేమిటి? అక్రమ షెడ్డు యజమానికి అంతటి పలుకుబడి ఉందా? లేక తెరవెనుక ఏదైనా వ్యవహారం నడుస్తోందా? ముడుపులు అందాయనే అనుమానాలకు తావిస్తున్న పరిణామాలపై ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదు? గాజులరామారం సర్కిల్--57 పరిధిలోని రాంకీ మార్వెల్ వన్ సమీపంలోని అక్రమ షెడ్డు వ్యవహారం ఇప్పుడు అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది.ప్రభుత్వ భూమిలో అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నారనే ఆరోపణలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర సిబ్బందితో కలిసి జేసీబీతో కూల్చివేతకు వెళ్లినట్లు సమాచారం. అయితే అక్కడ నిర్మాణ దారుడి నుంచి అధికారుల బృందానికి అడ్డంకులు ఎదురైనట్లు ఆరోపణలు వినిపించాయి. రాజకీయ పలుకుబడి ఉందంటూ నిర్మాణ దారుడు అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల మధ్య కూల్చివేత పూర్తికాకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జేసీబీతో వచ్చి ఏం సాధించారు?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జేసీబీతో క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు ప్రజల్లో ఆశలు కలుగుతాయి. ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డు ఉంటే దాన్ని తొలగిస్తారని భావిస్తారు. కానీ కూల్చివేతకు వెళ్లిన అధికారులు తిరిగి వెనుదిరిగితే ప్రజలకు ఎలాంటి సందేశం వెళుతుంది? కేవలం పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే







హడావుడి చేయడానికేనా అధికారుల పర్యటనలు? చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంటే కారణాలు వెల్లడించాలి కదా? ఏసీపీ సుమిత్ర ఆధ్వర్యంలో వెళ్లిన బృందం కూల్చివేతను ఎందుకు పూర్తి చేయలేకపోయింది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ముడుపుల ఆరోపణలకు తావిస్తున్న పరిణామాలు!

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి కూడా నిర్మాణాలను తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కూల్చివేతకు వచ్చి వెనుదిరగడం వెనుక ఏదైనా ఒత్తిడి ఉందా? నిర్మాణదారుడితో అధికారులకు ఏదైనా అవగాహన కుదిరిందా? డబ్బుల వ్యవహారం జరిగిందనే అనుమానాలకు ఆస్కారం ఉందా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటో తేల్చాల్సింది ఉన్నతాధికారుల విచారణే. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. నిజం కాకపోతే అనుమానాలకు తావులేకుండా వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

అనుమతులు లేని అక్రమ షెడ్లకు ఎందుకీ రక్షణ?

సర్కిల్--57 పరిధిలో అనుమతులు లేని షెడ్ల నిర్మాణాలపై ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ భూమిలోనే నిర్మాణం జరిగిందా? రెవెన్యూ రికార్డుల్లో భూమి స్వరూపం ఏమిటి? నిర్మాణదారుడి వద్ద ఏమైనా చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. అనుమతులు లేని నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సింది పోయి ఎందుకు కాలయాపన చేస్తున్నారు?

ఏసీపీ సుమిత్రకు ఉన్నతాధికారుల ప్రశ్నలు!

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. జేసీబీతో కూల్చివేతకు వెళ్లినప్పుడు ఏం జరిగింది? అధికారులను ఎవరు అడ్డుకున్నారు? విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఏ చర్యలు తీసుకున్నారు? షెడ్డు కూల్చివేత ఎందుకు పూర్తికా లేదు? నిర్మాణదారుడికి నోటీసులు ఇచ్చారా? ఇచ్చినట్లయితే తదుపరి చర్యలేమిటి? కూల్చివేతకు వెళ్లిన అధికారుల బృందం తిరిగి రావడానికి కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి. కేవలం క్షేత్రస్థాయి పర్యటనలతో బాధ్యత ముగిసిపోదని అధికారులు గుర్తించాలి.

కమిషనర్ స్పందిస్తారా? విచారణకు ఆదేశిస్తారా?

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకోకూడదు. ప్రభుత్వ భూమి అని ఆరోపణలు వస్తున్న ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేయించాలి. షెడ్డు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి హక్కులు, కూల్చివేతకు వెళ్లిన అధికారుల నివేదికలను పరిశీలించాలి. అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయా? విధులకు ఆటంకం కలిగించారా? ముడుపుల ఆరోపణల్లో వాస్తవం ఉందా? అనే అంశాలపై నిష్పక్షపాత విచారణ జరపాలి.
ప్రభుత్వ భూమి ఎవరి సొంత ఆస్తి కాదు.
అక్రమ నిర్మాణదారుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గకూడదు. జేసీబీతో వెళ్లి వెనుదిరగడం కాదు.. అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి.
లేనిపక్షంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలపై ప్రజల్లో ఉన్న అనుమానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

పాఠశాలల్లో ట్రాఫిక్ క్లబ్‌ల ఏర్పాటుకు పోలీసుల శ్రీకారం



- విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన.. ట్రాఫిక్ నియంత్రణ పరికరాలపై ప్రత్యక్ష శిక్షణ

మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్):
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో ట్రాఫిక్ క్లబ్‌ల ఏర్పాటు లక్ష్యంగా బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంతో పాటు బహిరంగ శిక్షణ నిర్వహించారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఆరు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, పాదచారుల భద్రత, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు అధికారులు విద్యార్థులకు వివరించారు.కేవలం మాటలకే పరిమితం కాకుండా ట్రాఫిక్ విధుల్లో పోలీసులు వినియోగించే పరికరాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేశారు. బ్రీత్ అనలైజర్లు, లాఠీ లైట్లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లు, ట్రాఫిక్ కోన్లు తదితర పరికరాల పనితీరు, ట్రాఫిక్ నియంత్రణలో వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కవేటి శ్రీనివాసులు, తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. సర్దార్ నాయక్, ఆల్వాల్ ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ జి. జానకి రాములు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.బోల్టన్ హైస్కూల్, అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్, పల్లవి మోడల్ స్కూల్ (బోయిన్‌పల్లి), సెయింట్ మైఖేల్స్ స్కూల్ (ఆల్వాల్), పల్లవి మోడల్ స్కూల్ (తిరుమలగిరి), సెయింట్ పయస్ స్కూల్ (ఆల్వాల్) విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా ఎదుగుతారని పోలీసులు పేర్కొన్నారు. పాఠశాలల్లో ట్రాఫిక్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులను రహదారి భద్రతా కార్యక్రమాల్లో భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.





అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో వసూళ్లు - సూపర్‌వైజర్‌పై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

హైదరాబాద్:అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియలో అక్రమ వసూళ్ల ఆరోపణలు తీవ్ర కలకలం రేపుత ఎన్నాయి. అంగన్‌వాడీ టీచర్ల ఖాళీల భర్తీకి ప్రభు త్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఆయా జిల్లా ల కలెక్టర్లు నియమకాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తున్నారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి అప్లై చేసుకున్న వారి జాబితాను పంచాయతీ నోటీస్ బోర్డులో కూడా ప్రదర్శిస్తు న్నారు.ఉద్యోగానికి ఎంపిక కాకముందే వసూళ్ల ఆరోపణలు రావడంతో అర్హులను పక్కన పెట్టారంటూ డీడబ్ల్యూవో(జిల్లా సంక్షేమ అధికారి) కార్యాలయానికి ఫిర్యాదులు పెద్ద మొత్తంలో అందాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాజెక్టు పరిధిలోని ఓ సెక్టార్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఈ వ్యవహారానికి పాల్పడ్డారనే ఆరోపణతో సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవో శిరీష తొర్రూరు సీడీపీవో (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) కార్యాల యంలో విచారణ చేపట్టారు.డబ్బులు వసూలు చేశారని ఆరోపణలుతొర్రూరు ఐసీడీఎస్



(ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) ప్రాజెక్టు పరిధిలో 10 సెక్టార్‌లున్నాయి. వీటిలో 29 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 462 అప్లికేషన్లు వచ్చాయి. ఓ సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ తాను టీచర్ ఉద్యోగాలను ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేశారని పలువురు ఆరోపించారు. దీంతో సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవో శిరీష తొర్రూరు సీడీపీవో ఆఫీస్‌లో ముమ్మర విచారణ చేపట్టారు. విషయం బయటకు రావడంతో ఆ అధికారి డబ్బులు తిరిగి ఇచ్చేసినట్లు సమాచారం తెలిసింది. అదే సెక్టార్‌లోని బీమునితండాలో దరఖాస్తుదారుల నివాస ధ్రువీకరణ పత్రంలో అకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.అభ్యర్థుల్లో అయోమయంఅక్ర మ వసూళ్ల వ్యవహారం చర్చకు దారితీయడంతో దరఖాస్తుదారులు అయోమయంతో ఆందోళన చెందుతున్నారు. అర్హత, మెరిట్ ఉండి ఆర్థిక స్థోమత లేనివారు ఈ అంగన్?వాడీ టీచర్? ఉద్యోగం వస్తుందో రాదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష నిర్వహించి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.దళారుల మాటలను విని మోసపోవద్దుదళారుల మాటలను విని డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని మహబూబాబాద్ ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవో శిరీష స్పష్టం చేశారు. తొర్రూరులోని ఓ సెక్టార్‌లో జరిగిన అవకతవకలపై సోమవారం విచారణ పూర్తి చేసి నట్లు వెల్లడించారు. ఆ నివేదికను జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్‌కు అందజేస్తామని తెలిపారు.

నిమ్స్ ఆసుపత్రిలో మరోసారి ఏసీబీ సోదాలు.. టెండర్ల రికార్డుల పరిశీలన



హైదరాబాద్, నవంబర్ 17: నగరంలోని నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రిలో ఏసీబీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో రికార్డ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు 10 మంది ఏసీబీ అధికారుల బృందం తనిఖీల్లో పాల్గొంది. గత నెల అక్టోబర్‌లో జరిగిన సోదాలకు అనుగుణంగా మరోసారి సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. మ్యాన్‌పవర్ రిక్రూట్‌మెంట్, సెక్యూరిటీ, క్యాంటీన్, స్టోర్స్, మెడికల్ షాపు టెండర్ల పత్రాలను పరిశీలించినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు అడిగిన డాక్యుమెంట్స్‌ను డాక్టర్లు అందించినట్లు తెలుస్తోంది.ఈ ఏడాదిలో వరుసగా నాలుగోసారి నిమ్స్ ఆస్పత్రిలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. గత నెల నిమ్స్‌లో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. క్యాంటీన్, మెడికల్ స్టోర్లు, సర్జికల్ స్టోర్లలో సోదాలు చేశారు. లంచాల వ్యవహారానికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. 2014 నుంచి నిమ్స్ హాస్పిటల్లో జరిగిన అక్రమార్కుల దందాపై ఫోకస్ పెట్టిన ఏసీబీ ఈ మేరకు సోదాలు నిర్వహిస్తోంది.లక్ష్మీ భాస్కర్‌కు బెయిల్నిమ్స్‌లో నిధుల అవకతవకలు, ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్‌కు బెయిల్ మంజూరు అయ్యింది. భాస్కర్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను ఏసీబీ కోర్టు మంజూరు చేసింది. ప్రతి మంగళవారం పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. రూ.25 వేల నగదు, రెండు పూచీకత్తులు సమర్పించాలని లక్ష్మీ భాస్కర్‌కు ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.


రేషన్ బియ్యం దందా.. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్రమ రవాణా



హత్నూర(సంగారెడ్డి): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పల్లెల్లో ఇంటింటికీ తిరుగుతూ తక్కువ ధరకు బియ్యాన్ని సేకరిస్తున్న దళారులు, వాటిని రైస్ మిల్లులకు, పరిశ్రమలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో దళారులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వీధుల్లో తిరుగుతూ రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.20 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి, అక్కడి నుంచి రైస్ మిల్లులకు కిలో రూ.35 వరకు విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు. హత్నూర మండలంలో భువనగిరి జిల్లాకు చెందిన పలువురు వ్యక్తులు ప్రత్యేకంగా ఆటోలు కొనుగోలు చేసి మరీ గ్రామాల్లో తిరుగుతూ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

తెలంగాణలో ప్రభుత్వ భూములు ఎన్ని? - రీసర్వేలో తొలుత బయటపడేవి అవే!

హైదరాబాద్:తెలంగాణలో సర్కారు భూములు ఎన్ని? ఏ శాఖ పరిధిలో ఎంత విస్తీర్ణం ఉంది. ఎక్కడెక్కడ కబ్జాలకు గురయ్యాయి. రికార్డుల్లో ఉన్న వివ రాలు, క్షేత్రస్థాయిలో ఉన్న స్థలాల హద్దులు ఇప్పుడు అలాగే ఉన్నాయా? ప్రభుత్వ విభాగాల వద్ద ఉన్న లెక్కలు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వివ రాలకు తేడా ఉందా? అనేది స్పష్టంగా తెలిసి పోనుంది. రాజధాని హైదరా బాద్ మినహా అన్ని జిల్లాల్లో త్వరలో భూముల సమగ్ర రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయి ంచిన సంగతి తెలిసిందే. తొలుత ప్రభుత్వ భూముల లెక్కలనే అధికారులు నిర్ధారించను న్నారు. ఇటీవల భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) అన్నీ జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన మార్గదర్శకాల్లో పలు అంశాలను స్పష్టంగా పేర్కొన్నారు.ప్రభుత్వ భూముల సర్వే ఎలా చేస్తారంటేగ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ముందుగా సర్వే చేస్తారు. ముందుగా గ్రామ భూముల రికార్డులను అధికారులు పరిశీలిస్తా రు. పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డులో ఫారం-9 కింద సాధారణ నోటీసును పబ్లిష్ చేస్తారు. ప్రభుత్వ భూముల సరిహద్దులో ఉన్న



పట్టా భూముల యజమానులను సమన్వయం చేసుకుని ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే చేస్తారు. రికార్డులకు, వాస్తవానికి తేడా ఉంటే దానికి సంబంధించిన కారణాలను రికార్డుల్లో నమోదు చేస్తారు.ఫారం-10 నోటీసుల ఇచ్చిచెరువులు, అటవీ భూములు, కుంటలు, నీటి సదుపాయ వనరులు ఇతర శాఖలకు కేటాయించిన భూముల రీ సర్వేకు ముందు ఆయాశాఖల అధికారులకు ఫారం-10 నోటీసులు ఇచ్చి వారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములుగా చేస్తారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు గుర్తిస్తే సరిహద్దుల్లోని పట్టా భూముల యజమానులతో గ్రామ పెద్దల సమక్షంలో ఆ పరిధిలోని తహసీల్దారు నేతృత్వంలో సంప్రదింపులు, చర్చలు జరుపుతారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి అప్పీలుకు సమయం ఇస్తారు. అప్పీలు గడువు ముగిశాక తుది నిర్ణయం తీసుకుని భూ భారతి పోర్టల్లో ప్రభుత్వ భూముల విస్తీర్ణాలను అధికారులు నమోదు చేస్తారు.రీసర్వేతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడేనాగత కొంత కాలంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న వారు వాటి క్రమబద్ధీకరణకు చేయని ప్రయత్నాల ంటూ ఉండవు. గతంలో జీవో 58, 59 ద్వారా భూముల విస్తీర్ణాలను అధికారులు నమోదు భారీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన వాటిలో మిగులు భూములపై మానిటరింగ్ ఉండటం లేదు. యూనివర్సిటీలు, మార్కెట్ స్థలాలు తదితర భారీ విస్తీర్ణం ఉండే భూములు ఇష్టారీతిన కబ్జాలకు గురవుతున్నా యి. ప్రస్తుతం చేపట్టే సర్వేలో ఇలాంటి వాటన్నింటికీ అడ్డుకట్ట వేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గతంలో చేపట్టిన సమాచార సేకరణలో ప్రభుత్వ చెందిన సుమారు 13.82 లక్షల ఎకరాల (ఎసైన్డ్ తదితర కాకుండా) ప్రభుత్వ భూములున్నట్లు అధికారులు గుర్తించారు.

ఏసీబీలో ఇంటి దొంగలు - డబ్బులిస్తే కేసు మూసివేయిస్తానంటూ ఇన్‌స్పెక్టర్ బేరసారాలు

హైదరాబాద్:మిమ్మల్ని కేసులో నుంచి తప్పించేందుకు సహకరిస్తా! 30 లక్షలు ఇస్తే కేసు నీరుగార్చేలా చేసి మీకు అనుకూలంగా మార్చేస్తా! అయితే మీరు మాత్రం దర్యాప్తు అధికారి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని మాపై ఫిర్యాదు చేయండి! అప్పుడు మాకెలాంటి ఇబ్బంది ఉండదు! ఇదీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడితో ఓ ఏసీబీ అధికారి సాగించిన సంభాషణ. కంచే చేను మేసిన విధంగా అవినీతిని నిరోధించాల్సిన అధికారే లంచాల బాట పట్టిన వ్యవహారం ప్రస్తుతం ఏసీబీ అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.
ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండుల ఆట కట్టించాల్సిన ఏసీబీ అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి లంచం డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు వరుస ట్రాప్ కేసులు, మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న తరుణంలో, ఓ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ వ్యవహారశైలి ఆ శాఖ ప్రతిష్టకు మచ్చ తెచ్చేలా మారింది. బాధితుడిగా మారిన సదరు నిందితుడు నేరుగా ఏసీబీ ఉన్నతాధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు సదరు ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు వేసి, అంతర్గత విచారణ చేయాలని ఆదేశించారు.హైదరాబాద్ శివార్లలో విద్యుత్తు పంపిణీ సంస్థలో పనిచేస్తున్న ఓ అధికారిపై ఏడాది క్రితం నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల



కేసులో ఈ వ్యవహారం అంతా నడిచింది. బెయిల్‌పై విడుదలైన నిందితుడు తన కేసును పర్యవేక్షిస్తున్న ఇన్‌స్పెక్టర్ లంచం డిమాండ్ చేశారంటూ ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గతేడాది సెప్టెంబరులో నిందితుడు కారాగారంలో ఉన్న సమయంలో ఓ కాంట్రాక్టర్ ములాఖత్‌పై ఆయన్ను కలిశాడు. నిందితుడి కేసును పర్యవేక్షిస్తున్న అధికారి తనకు బాగా పరిచయమంటూ డబ్బులిస్తే కేసు మూసివేయించేలా చేస్తానంటూ చెప్పాడు. బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితుడికి కాంట్రాక్టర్ మరోసారి ఫోన్‌చేసి అదే విషయం చెప్పాడు. ఈ క్రమంలో బెయిల్ షరతుల నిమిత్తం నిందితుడు గతేడాది డిసెంబరులో ఏసీబీ కార్యాలయానికి వెళ్లినప్పుడు దర్యాప్తు బృందంలోని ఓ కీలకాధికారి చేసిన సూచనను ఆసరాగా చేసుకుని దర్యాప్తు అధికారి నిందితుడితో బేరసారాలు మాట్లాడారు.నిందితుడిని అరెస్ట్ చేసినప్పుడు అతడికి బినామీగా అదేహోదా కలిగిన అధికారిని కేసులో మరో అక్యూస్డ్?గా చేర్చారు. అయితే ఉన్నతాధికారుల సమీక్షలో ఈ విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. నిందితుడితో సమాన హోదా కలిగిన అధికారిని బినామీగా చూపడంపై సమీక్షించి సరైన ఆధారాలు లేకపోవడంతో అతడి పేరు తొలగించాలని ఆదేశించినట్లు తెలిసింది. అంతర్గతంగా జరిగిన ఈ అంశాన్ని దర్యాప్తు అధికారి తనకు అనుకూలంగా మార్చుకొని నిందితుడిని మభ్యపెట్టారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే బినామీ జాబితాలో నుంచి సమాన హోదా కలిగిన అధికారిని తొలగించేందుకు రూ.15 లక్షలతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసును తొలగించేందుకు మరో 15 లక్షలివ్వాలని డిమాండ్ చేసినట్లు నిందితుడు ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.రూ.5 లక్షలు దర్యాప్తు అధికారికిదర్యాప్తు అధికారి లంచం డిమాండ్ చేసిన నేపథ్యంలో పలు విడతలుగా బేరసారాలు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు అదే నెల 14న కూడా సంబంధిత డీఈ ఫోన్ చేసి డబ్బుల విషయం మాట్లాడారంటూ నిందితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంపై అత్యంత గోప్యంగా, లోతుగా అంతర్గత విచారణ కొనసాగుతోంది.

అదుపులోకి అశ్వపురం క్లోరిన్ గ్యాస్ లీకేజ్.. తప్పిన పెను ప్రమాదం



భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు 25: జిల్లాలో అశ్వపురం మండలంలోని మిట్ట గూడెం రథంగుట్ట వద్ద గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌లో మూడు రోజులుగా క్లోరిన్ గ్యాస్ లీకవుతున్న ఘటనపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గ్యాస్ లీకవుతున్న 1600 కిలోల కెపాసిటీ గల సిలిండర్‌ను గుర్తించి తగిన చర్యలు తీసుకున్నారు.భద్రాద్రి జిల్లాలోని అశ్వపురం మండలంలోని మిట్టగూ డెం రథంగుట్ట వద్ద గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌లో క్లోరిన్ గ్యాస్ లీక్ కలకలం రేపింది. మూడు రోజులుగా గ్యాస్ లీకవుతు న్నా.. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన అధికారులు.. లీకేజీపై వార్తా కథనాలు రావడంతో అప్రమత్తమయ్యారు. హుటాహు టిన ఘటనా స్థలానికి చేరుకుని.. గ్యాస్ లీక్ అవుతోన్న 1600 కిలోల కెపాసిటీ గల సిలిండర్‌ను గుర్తించారు. అర్ధరాత్రి ఈ గ్యాస్ సిలిండర్ వాల్వ్ విప్పి.. దానికి పైప్ అమర్చి.. నీటి కాలువలోకి వదిలారు. విషవాయువు ప్రభావం సమసిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. సమీప గ్రామ ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

కంఠేశ్వర ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం



నిజామాబాద్, నవంబర్ 25: జిల్లాలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత పర్యటించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కంఠేశ్వర్‌లోని శ్రీ నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యు లతో కలిసి స్వామిని దర్శించుకుని.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు నీలకంఠేశ్వర స్వామి కొంగు బంగారమని తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజు స్వామి వారి దర్శనం.. మరుసటి రోజు శ్రీనీలకంఠేశ్వర స్వామి వారికి అభిషేకం చేయడం తమ కుటుంబ ఆనవాయితీ అని చెప్పుకొచ్చారు.నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో మరికొన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని అర్చకులు తెలిపారని కవిత అన్నారు. నిజామాబాద్ బిడ్డగా ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రజలకు కవిత కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

గచ్చిబౌలి పీజీ హాస్టల్‌లో ఈగల్ తనిఖీలు - డ్రగ్స్ పరీక్షలో ఆరుగురికి పాజిటివ్

హైదరాబాద్:పీజీ హాస్టళ్లలో గంజా వాడకంపై ఈగల్ అధికారుల దృష్టి సారించారు. ఈ నేప థ్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి పీజీ హాస్టల్‌లో ఈగల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉంటున్న 8 మంది అనుమానితులకు డ్రగ్స్ పరీక్ష నిర్వహించారు. వారిలో ఆరుగురికి గంజా పాజిటివ్ వచ్చింది. వారిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉండటం గమనార్హం. హైద రాబాద్ నగరంలోని మాదాపూర్, కొండా పూర్ ఐటీ హబ్‌లలో పీజీలపై ఈగల్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. పీజీ హాస్టళ్లలో డ్రగ్ పెడ్లర్లు చురుగ్గా ఉన్నారని అధికారుల గుర్తిం చారు. ఈ నేపథ్యంలో తనిఖీలు చేపట్టా రు.ఒత్తిడి కారణంగా మత్తు బాటడ్రగ్స్ కేసుల్లో గతంలోనూ అనేకసార్లు ఐటీ ఉద్యోగులు అధికా రులకు చిక్కారు. అయితే సమాధానాలు విని పోలీసులే విస్తుపోతున్నారు. భరించలేని ఒత్తిడి



కారణంగా మానసిక ప్రశాంతత కోసం వీటిని తీసుకుంటున్నట్లు గతంలో అనేకమంది తెలిపారు. ప్రస్తుతం అనేక రంగాల్లో ఒత్తిడి సర్వసాధారణంగా మారింది. అయితే కొందరు ఉద్యోగులు మాత్రం ఒత్తిడి సాకుతో మత్తు వైపు అడుగులు వేస్తూ వాటికి బానిసలవుతున్నారు. స్నేహితుల ప్రోత్సాహంతోమత్తుకు బానిసలవు తున్న యువతలో అనేక మంది వారాంతాన్ని సరదాగా గడిపేందుకు ముందుగానే ప్లాన్? చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా పబ్బులు, నగర శివార్లలోని ఫామ్ హౌస్‌లకు వెళ్తున్నారు. ఆయా చోట్ల స్నేహితుల ప్రోత్సా హం, ఇతర కారణాలతో కొద్ది కొద్దిగా ప్రారం భిస్తున్నారు. ఆపై క్రమంగా మత్తుకు అలవాటు అవుతున్నట్లు పోలీసులు గుర్తిం చారు.సర్ మా పిల్లల్ని మార్చండిగతంలో ఒక కేసులో ఓ తండ్రి ఈగల్ అధికారులకు కొడుకు పరిస్థితి గురించి వివరించి ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఓ తల్లి కూడా ఇదే తరహాలో ఈగల్ అధికారులను సంప్రదించారు. 'మా అబ్బాయి ప్రవర్తనలో తేడా వచ్చింది. ఎప్పుడూ మాతో గొడవ పడుతున్నాడు. ఐటీ కంపెనీలో రూ.25 లక్షల ప్యాకేజీ వస్తుండేది. కానీ గంజాయికి బానిసై ఉద్యోగం పోగొట్టుకున్నాడు. వాడిని మాములు మనిషిని చేయాలి' అని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి కాల్స్? తెలంగాణలోని ఈగల్ విభాగం టోల్‌ఫ్రీ నంబరు 1930కు అధికంగా వస్తున్నాయని గతంలో అధికారులు తెలిపారు.

ములుగులో కాంగ్రెస్ రౌడీ రాజ్యానికి సీసీటీవీనే సాక్ష్యం..!



● బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :ములుగులో కాంగ్రెస్ పాలనలో ప్రజా స్వామ్యం ఖూనీ అవుతోంది. ప్రజల సమ స్యలను ప్రశ్నించే గొంతులను బెదిరింపులతో అణచివేయాలని చూస్తున్నారు.

అర్ధరాత్రి 2:42 గంటలకు 3 నుంచి 4 బైక్‌లపై కత్తులతో వచ్చిన వ్యక్తులు నా ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు, వ్యక్తుల ముఖాలు, బైక్ నంబర్లు సీసీటీవీలో స్పష్టంగా రికార్డయ్యాయి.ఈ దాడి వెనుక కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రధాన అనుచరుల హస్తం ఉందనే అనుమానాలు ఉన్నాయి.

కాంగ్రెస్ నాయకులకు నా సూటి ప్రశ్న.. ఫ్లెక్సీలు చింపడానికి వచ్చారా? లేక భూక్య జంపన్నను హతమార్చడానికి వచ్చారా?

ఆరు గ్యారెంటీల అమలును, మీ అవినీతిని ప్రశ్నిస్తే కత్తులతో బెదిరిస్తారా? వినండి.. మీ బెదిరింపులకు నేను భయపడను.. వెనక్కి తగ్గను. నా ప్రశ్నించే తత్వాన్ని ఆపలేరు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటా.. పోరాడుతూనే ఉంటా.

ఈ ఘటనపై సీసీటీవీ ఆధారాలతో చట్టపరమైన పోరాటం చేస్తాం. దాడికి పాల్పడిన వారితో పాటు వారి వెనుక ఉన్న వారిని కూడా చట్టం ముందు నిలబెడతాం.

గుర్తుంచుకోండి.. ఫ్లెక్సీలు చింపగలరేమో కానీ ప్రజల కోసం ప్రశ్నించే భూక్య జంపన్న గొంతును మాత్రం ఆపలేరు!

కుర్చీలో అధికారి.. క్షేత్రంలో అక్రమాలు!

● దుండిగల్‌లో అధికారులదా? బిల్డర్లదా పెత్తనం?
● అక్రమాలకు అడ్డుకట్ట వేయలేని అధికారం ఎందుకు?
● బిల్డర్లకు బరితెగింపు.. అధికారులకు బాధ్యత లేదా?
● దుండిగల్‌లో అధికారుల కళ్లు మూసుకున్నాయా?
● అక్రమ నిర్మాణాలకు అడ్డా..
అధికారుల మౌనమే అండా?
● సర్కిల్--59లో సాగుతున్నదేమిటి?









కుత్బుల్లాపూర్, నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :దుండిగల్ సర్కిల్--59లో అక్రమ నిర్మాణాలు ఎన్ని వెలుస్తున్నా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారా? నిర్మాణదారులు నిబంధనలను పక్కనపెట్టి భవనాలు నిర్మించుకుంటుంటే అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నట్లు? అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన డిప్యూటీ కమిషనర్ బాధ్యతలు నిర్వర్తి స్తున్నారా? లేక అక్రమ నిర్మాణాల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. సర్కిల్--59లో పరిస్థితి చూస్తుంటే అక్రమంగా ఎన్ని నిర్మాణాలు చేపట్టినా తమకు పట్టింపు లేదన్న రీతిలో అధికారుల వ్యవహారశైలి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

➔ అక్రమ నిర్మాణాలకు అంతులేదా..

అధికారుల పర్యవేక్షణ ఏమైంది?

నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా భవనాలు వెలుస్తున్నాయనే ఫిర్యాదులు వస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎందుకు కొరవడుతోంది? నిర్మాణాలు ప్రారంభమైనప్పుడే గుర్తించి అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం ఏం చేస్తోంది? అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు నిద్రపోతున్నారా? భవనాలు పూర్తయ్యాక నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటే లేదు? సర్కిల్--59లో ఇప్పటివరకు ఎన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు? ఎన్ని నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి? ఎన్ని ఫిర్యాదులు అందాయి?

వాటిపై తీసుకున్న చర్యలేమిటి? ఈ వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

➔డిప్యూటీ కమిషనర్ మౌనానికి కారణమేంటి?

సర్కిల్ పరిపాలనతో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన బాధ్యత డిప్యూటీ కమిషనర్‌పై ఉంటుంది. అలాంటప్పుడు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా? నిర్మాణదారులకు నిబంధనలు వర్తించవా? అధికారుల నిర్లక్ష్యం వల్లే అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత డిప్యూటీ కమిషనర్‌పై ఉంది.

➔సీఎంసీ ఆదాయానికి భారీ గండి పడే ప్రమాదం!

అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు సాగితే ప్రభుత్వానికి రావాల్సిన నిర్మాణ రుసుములు, ఇతర ఆదాయాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాలపై సకాలంలో చర్యలు తీసుకోకపోతే సీఎంసీ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రజాధనానికి నష్టం జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం



ప్రభుత్వానికి జరిగే నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు?



అందిన ఫిర్యాదులు, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక తెప్పించాలి. నిర్మాణ అనుమతులు, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించి అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆర్థిక అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉంటే వాటిపైనా నిష్పక్షపాత విచారణ జరిపించాలి.

➔అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

ప్రజలు ఫిర్యాదులు చేయాలి.. అధికారులు మాత్రం పట్టించు కోకూడదా? బిల్డర్లు నిర్మాణాలు చేపట్టాలి.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడాలి.. ఇదేనా సర్కిల్--59లో పరిపాలన? అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ఫిర్యాదులు వచ్చినా మౌనమే సమా ధానంగా ఉంటుందా? కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ స్పం దించి విచారణ చేపట్టకపోతే సీఎంసీ ఆదాయానికి మరింత న ష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చే స్తు న్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి సర్కిల్--59 లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది.

బస్‌స్టాప్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు.. వారిపైకి దూసుకెళ్లిన వాహనం



ముంబై: ఒక బస్‌స్టాప్ వద్ద కొందరు విద్యార్థులు వేచి ఉన్నారు. అదుపుతప్పిన వాహనం వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పూణేలోని బోప్‌దేవ్ ఘాట్ ప్రాంతంలో ఘోర ప్రమాదం జరిగింది. గర్వా హోటల్ సమీపంలోని బస్‌స్టాప్ షెల్టర్ వద్ద కొందరు విద్యార్థులు నిల్చొని ఉన్నారు. కాగా, అక్కడి బిజీ రోడ్డుపై వెళ్తున్న ఒక రవాణా మినీ లారీ అదుపుతప్పింది. బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులపైకి అది దూసుకెళ్లింది. గమనించిన కొందరు స్టూడెంట్స్ తప్పించుకునేందుకు పరుగులు తీశారు. అయితే మరి కొందరు విద్యార్థులు ఆ వాహనం కింద నలిగిపోయారు. ఈ సంఘటన తర్వాత ఆ ట్రక్ ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది.మరోవైపు ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కూడా అక్కడకు చేరుకున్నారు. గాయ పడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌ను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన

ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఆరుగురిని కాలువలో తోసివేత.. ముగ్గురు మృతి, ప్రాణాలతో బయటపడిన బాలుడు



గాంధీనగర్: ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు కారులో ప్రయాణించారు. కొందరు వ్యక్తులు మరో వాహనంలో వారిని అనుసరించారు. ఒకచోట ఆ కుటుంబాన్ని అడ్డుకున్నారు. భార్యాభర్తలు, పిల్లలను కాలువలోకి తోసేశారు. ముగ్గురు మరణించగా ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. ఒక బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. మహారాష్ట్రలోని జల్గావ్‌కు చెందిన ఒక కుటుంబంలోని ఆరుగురు ఒక పని నిమిత్తం గుజరాత్‌లోని సూరత్‌కు కారులో ప్రయాణమయ్యారు. నలుగురు వ్యక్తులు మరో వాహనంలో వారిని అనుసరించారు.కాగా, నవంబర్ 21న రాత్రి వేళ గుజరాత్‌లోని బార్డోలి తాలూకా ఉవా గ్రామం సమీపంలో మరో వాహనంలోని వ్యక్తులు ఆ కుటుంబం ఉన్న కారును అడ్డుకున్నారు. ఆ ఆరుగురిని ఒక కాలువలోకి తోసేశారు. అయితే మహువా సమీపంలోని కాలువలో దంపతులతో సహా ముగ్గురి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. నితిన్ అలియాస్ భురియా పాటిల్, ఆయన భార్య కవిత, 9 ఏళ్ల కుమార్తెగా మృతులను గుర్తించారు. రెండేళ్ల చిన్నారి, 16 ఏళ్ల బాలుడు గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మరోవైపు ఆ కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలుడు ఒక్కడే ప్రాణాలతో బయపట్టాడు. ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఆదివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయం చెప్పాడు. మహారాష్ట్రలోని ఇంట్లో ఉన్న అతడి పెద్ద సోదరికి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితులను గుర్తించామని, వారిని అరెస్ట్ చేసేందుకు ఆరు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు

సైబరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమే లక్ష్యం

● మూడు రోజుల పాటు 'సైబరాబాద్ మూవ్స్--2026'.. ప్రజా రవాణా, రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్చలు

బాలానగర్ నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :సైబరాబాద్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి శాశ్వత పరిష్కారాలు కనుగొనడంతో పాటు, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా 'సైబరాబాద్ మూవ్స్--2026' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆధునిక రవాణా వ్యవస్థకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం, ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం, పర్యావరణహిత ప్రయాణ విధానాలను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

హైదరాబాద్‌లోని రాయదుర్గం టీ-హబ్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ చర్చలు, అవ గాహన కార్యక్రమాలు, వినూత్న రవాణా పరిష్కారాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్ శాఖ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, డబ్ల్యూఆర్ఐ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రజా రవాణాకు ప్రోత్సాహం.. ట్రాఫిక్‌కు పరిష్కార మార్గాలు ప్రస్తుతం సైబరాబాద్ పరిధిలో ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాంతాలు విస్తరిస్తుండటంతో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా కార్యాలయాల వేళల్లో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సులు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను మరింతగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా పాదచారులకు సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, సైకిళ్ల కోసం ప్రత్యేక మార్గాలు, రద్దీగా ఉండే కూడళ్ల అభివృద్ధి, ప్రత్యేక బస్సు మార్గాల ఏర్పాటు వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించనున్నారు. ఇంటి నుంచి ప్రజా రవాణా కేంద్రాలకు చేరుకునే మార్గాల్లో మెరుగైన అనుసంధాన సౌకర్యాలు కల్పించడం, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులు ఉమ్మడిగా వాహనాలను వినియోగించే విధానాలను ప్రోత్సహించడం వంటి ప్రతిపాదనలపైనా చర్చించనున్నారు.



➔ విద్యార్థుల ఆలోచనలు.. నిపుణుల సూచనలు

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పౌరులు రూపొందించిన వినూత్న రవాణా పరిష్కారాలను ప్రదర్శించనున్నారు. రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్రయాణ సమయం ఆదా, వాహనాల రద్దీ తగ్గింపు వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా రంగ నిపుణులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, పౌర సంఘాల సభ్యులు ఈ చర్చల్లో భాగస్వాములు కానున్నారు.

➔ భవిష్యత్తు సైబరాబాద్‌కు ఉమ్మడి కార్యాచరణ

మూడు రోజుల కార్యక్రమం ముగింపు సందర్భంగా సైబరాబాద్ రవాణా వ్యవస్థను భవిష్యత్తులో మరింత మెరుగుపరిచేందుకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనున్నారు. కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా, ప్రజల ప్రయాణ అలవాట్లలో మార్పు తీసుకురావడం, ప్రజా రవాణాపై నమ్మకాన్ని పెంచడం, పాదచారులు, సైక్లిస్టులకు ప్రాధాన్యత కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలవనుంది. ప్రభుత్వ శాఖలు, పోలీసు వ్యవస్థ, కార్పొరేట్ సంస్థలు, రవాణా రంగ నిపుణులు, ప్రజలు సమష్టిగా కృషి చేస్తేనే ట్రాఫిక్ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సౌకర్యవంతమైన, కాలుష్యరహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసి సైబరాబాద్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే 'సైబరాబాద్ మూవ్స్--2026' కార్యక్రమం అంతిమ లక్ష్యంగా కనిపిస్తోంది.

అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్- శబరిమలకు 204 ప్రత్యేక రైళ్లు- ప్రయాణికుల కోసం అదనపు వసతులు

కేరళ:కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో భక్తుల ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా సాగించేందుకు దక్షిణ రైల్వే విస్తృత ఏర్పాట్లు చేసింది. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లను నడపడంతో పాటు ప్రధాన రైల్వే స్టేషన్లలో అదనపు సౌకర్యాలు కల్పించింది. భద్రతను కూడా కట్టుదిట్టం చేసింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి ప్రత్యేక రైళ్లను ముందుగానే అందుబాటులోకి తీసుకొచ్చినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. 204 ప్రత్యేక రైలు ట్రిప్పులుశబరిమల యాత్రకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చెన్నై-కొల్లం, తిరువనంతపురం-మంగళూరు, పన్వెల్-కొట్టాయం, విశాఖపట్నం-కొల్లం, హైదరాబాద్-కొల్లం, విజయవాడ-కొట్టాయం మార్గాల్లో ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుత యాత్రా సీజన్ కోసం మొత్తం 204 ప్రత్యేక రైలు ట్రిప్పులను ప్రకటించింది. ప్రయాణికుల డిమాండ్, టికెట్ బుకింగ్ సరళిని బట్టి అవసరమైతే మరిన్ని సర్వీసులను నడపనున్నట్లు



వెల్లడించింది. యాత్రా సమయంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొంది.ప్రధాన స్టేషన్లలో ప్రత్యేక సౌకర్యాలుశబరిమల భక్తుల కోసం కొట్టాయం, చెంగన్నూర్, ఎర్నాకులం జంక్షన్, ఎర్నాకులం టౌన్ రైల్వే స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వసతి, మరుగుదొడ్లు, ఆహారం, వైద్య సహాయం, రవాణా సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. కొట్టాయంలోని ప్రధాన ప్రవేశ ద్వారం సమీపంలో మూడు అంతస్తుల ప్రయాణికుల సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేసారి 900 మంది ప్రయాణికులు ఉండేందుకు వీలుంది. చెంగన్నూరులో 600 మంది ప్రయాణికులకు వసతి కల్పించేలా మూడు షెల్టర్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఒక ఏసీ వెయిటింగ్ హాల్, రెండు నాన్-ఏసీ పడక గదులు అందుబాటులో ఉన్నాయి. ఎర్నాకులం జంక్షన్‌లో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఏసీ వెయిటింగ్ హాళ్లు, విశ్రాంతి గదులు, భోజన సదుపాయాలు, లగేజీ నిల్వ సేవలను అందిస్తున్నారు.24 గంటల పాటు సహాయ కేంద్రాలుభక్తులకు అవసరమైన సమాచారం, సహాయం అందించేందుకు చెంగన్నూర్, కొట్టాయం రైల్వే స్టేషన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో 24 గంటల పాటు పనిచేసే సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు స్టేషన్లలో అదనపు నాన్-రిజర్వేషన్ టికెట్ కౌంటర్లు, బుకింగ్ సదుపాయాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతర్రాష్ట్ర ప్రయాణికులకు భాషాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా తెలుగు, కన్నడ, తమిళం మాట్లాడే సిబ్బందిని నియమించారు. భక్తుల ప్రయాణం సులభతరం చేసేందుకు దక్షిణ రైల్వే కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖ, కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ), ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు, పోలీసు, వైద్య శాఖలతో సమన్వయం చేసుకుంటోంది. ఎర్నాకులం, కొట్టాయం, చెంగన్నూర్, త్రిస్సూర్ రైల్వే స్టేషన్లలో టాక్సీలు నడిపేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది.

టీఎంసీని వీడాలని ప్రణబ్ ముఖర్జీనే చెప్పారు.. సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు..



పశ్చిమ బెంగాల్:తృణమూల్ కాంగ్రెస్ (టీఎం సీ)ను వీడి బీజేపీలో చేరాలని దివంగత మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ తనకు సూచిం చారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. టీఎంసీలోనే కొనసాగితే ఓ ఉద్యోగిలా మిగిలిపోతావని, సొంతంగా ఎదగాలనుకుంటే నరేంద్ర మోదీతో కలిసి ముందుకు సాగాలని ప్రణబ్ ముఖర్జీ తనకు సూచించినట్లు తెలిపా రు. కోల్‌కతాలో తాజాగా జరిగిన 'ది ఎకనామిక్ టైమ్స్ బెంగాల్ అసెండ్స్' కార్యక్రమంలో సువేందు అధికారి ఈ విషయాలను వెల్లడించారు 'ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో నేను ఆయనను కలిశాను. ఆ సందర్భంగా ప్రణబ్ నాకు కొన్ని కీలక సూచనలు చేశారు. టీఎంసీలోనే కొనసాగితే ఓ ఉద్యోగిలా ఉండిపోతావని, రాజకీయంగా సొంత గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటే మోదీతో కలిసి ముందుకు వెళ్లాలని నాకు చెప్పారు. ప్ర ణబ్ ముఖర్జీ నాకు ఒక మార్గదర్శకుడు. ఆ యన సలహాను నేను పాటించాను. ప్రణబ్ ముఖర్జీ ఇప్పుడు మన మధ్య లేరు. ఈ అంశంపై మరిన్ని వివరాలు చెబితే వివాదం తలెత్తే అవకాశం ఉంది' అని సువేందు పేర్కొ న్నారు టీఎంసీ పనితీరుపై ప్రణబ్ ముఖర్జీ చేసి న వ్యాఖ్యలను కూడా సువేందు అధికారి గురు ్తచేసుకున్నారు టీఎంసీని మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఆధిపత్యంలో నడిచే సంస్థగా ప్రణబ్ అభివర్ణించినట్లు తెలిపారు. వాళ్లిద్దరూ కలిసి పార్టీని ఒక ప్రైవేటు కంపెనీ తరహాలో నడుపుతున్నారని ప్రణబ్ చెప్పినట్లు సువేందు వివరించారు. ప్రణబ్ మాటల్లోని విషయాన్ని అర్థం చేసుకుని టీఎంసీ నుంచి బయటకు వచ్చానని సువేందు పేర్కొన్నారు.

ఉగ్రవాదం నుంచి వీర సైనికుడిగా. నజీర్ వానీ అరుదైన ప్రస్థానం

కశ్మీర్:కశ్మీర్ లోయలో ఒకప్పుడు ఉగ్రవాద బాట పట్టి.. ఆ తర్వాత భారత సైన్యంలో చేరి దేశం కోసం ప్రాణాలర్పించి నజీర్ అహ్మద్ వానీ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. 2018 నవంబర్ 25న షోపియాన్ జిల్లాలోని బటగుండ్ వద్ద జరిగిన ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వానీ (38) వీరమరణం పొందారు. ఆయన త్యాగానికి ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సతీశ్ దువా ఆయన జీవిత విశేషాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. తన 2024 పుస్తకం 'ఏ జనరల్ రెమినిసెన్స్: ఏ లైఫ్ అండర్ ఫైర్ ఇన్ కశ్మీర్'లో వానీ ప్రస్థానాన్ని దువా విపులంగా నమోదు చేశారు.కుల్గాం జిల్లా చక్ అమ్ముజి గ్రామంలో నజీర్ అహ్మద్ జన్మించారు. అతని తండ్రి సోనుల్లా వ్యవసాయంతో పాటు చిన్న దాబా నడిపేవారు. నజీర్ చిన్నతనంలో తివాచీలు నేస్తూ జీవనం సాగించారు. పండిట్ శుభన్ జీ అనే కశ్మీరీ



పండిట్ ఉపాధ్యాయుడి బోధనలు, గ్రామంలోని మాజీ సైనికుడు చెప్పిన యుద్ధ గాథలు ఆయన్ను ప్రభావితం చేశాయి. 'పెద్దయ్యాక నేను కూడా యుద్ధాలు చేస్తాను' అని నాడు బాలుడిగా వానీ అన్న మాటలు ఆ తర్వాత నిజమయ్యాయి. 1990వ దశకంలో కశ్మీర్‌లో అశాంతి నెలకొన్న వేళ తొలుత ఉగ్రవాద సంస్థల వైపు ఆకర్షితుడయ్యాడు. కొంతకాలం నజీర్ భారత్ సైనికులకు వ్యతిరేకంగా పని చేశారు. అనంతరం వివిధ'ఇఖ్వాన్' ద్వారా సాధారణ ప్రజల్లోకి వచ్చారు. 2004లో టెరిటోరియల్ ఆర్మీ (162వ బెటాలియన్ - జమ్మూకశ్మీర్ లైట్ ఇన్ఫంట్రీ)లో చేరారు.

శబరిమల మండల పూజ ప్రారంభం- తొలిరోజే పోటెత్తిన అయ్యప్ప భక్తులు!

కేరళ:కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్య ప్ప ఆలయంలో మండల- మకరవిళక్కు తీర్థ యాత్ర సీజన్ ప్రారంభమైంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచారు. 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణలతో శబరిమల కొండ మార్మోగింది. తొలి రోజే వేలాది మంది భక్తులు అయ్యప్ప స్వామి దర్శనం కోసం తరలివచ్చారు. రానున్న రెండు నెలల పాటు కొనసాగే ఈ వార్షిక తీర్థయాత్రకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.సోమవారం సాయంత్రం నుంచే ఆలయాల్లో ముందస్తు సంప్రదాయ కార్యక్ర మాలు నిర్వహించారు. మలయాళ క్యాలెండర్ ప్రకారం వృశ్చిక మాసం ప్రారంభమైన సందర్భంగా ఆలయాన్ని భక్తుల దర్శనార్థం తెరిచారు. కొత్తగా నియమితులైన ప్రధాన అర్చకుడు అరీక్కర సుబ్రమణియన్ శంకరన్ నంబూద్రి ఆలయ ద్వారాలను తెరిచి



పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అదే సమయంలో మాలికప్పురం ఆలయాన్ని కూడా తెరిచారు. అక్కడ కొత్త ప్రధాన అర్చకుడు ఏ. దామోదరన్ నంబూద్రి పూజలు నిర్వహించారు.దర్శనానికి భారీగా ముందస్తు బుకింగ్స్ఈ ఏడాది యాత్ర ప్రారంభ రోజుల్లోనే భారీ సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనం కోసం వర్చువల్ క్యూ విధానంలో ఇప్పటికే 66 వేల మంది ముందస్తు నమోదు చేసుకున్నారు. మరో 14 వేల మంది స్పాట్ బుకింగ్ ద్వారా దర్శనం పొందేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. రోజుకు గరిష్ఠంగా 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా ఆలయంలోని 18 పవిత్ర మెట్ల వద్ద భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడం ప్రధాన సవాలుగా మారింది. నిమిషానికి సుమారు 75 మంది భక్తులు మెట్లు ఎక్కేలా ఏర్పాట్లు చేస్తున్నారు.స్పాట్ బుకింగ్‌కు ప్రత్యేక కేంద్రాలుఆన్‌లైన్‌లో దర్శనం కోసం నమోదు చేసుకోని భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో స్పాట్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రధాన బేస్ క్యాంప్ నీలక్కల్‌తో పాటు ఎరుమేలి, వండిపెరియార్ సమీపంలోని సత్రం ప్రాంతాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే పంపా వద్ద స్పాట్ బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. అక్కడ బుకింగ్ సౌకర్యం కల్పిస్తే నదీ తీరంలోని యాత్రికుల కేంద్రంలో రద్దీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల ఆన్‌లైన్‌లో టికెట్లు పొందని భక్తులు ఆలయానికి బయలుదేరే ముందే నిర్దేశిత కేంద్రాల్లో స్పాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.రద్దీ నియంత్రణకు ఏఐ కెమెరాలుయాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు పలు చర్యలు చేపట్టింది. ఆలయ పరిసరాల్లో మెరుగైన లైటింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తుల రాకపోకల క్రమబద్ధీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నీలక్కల్ వాహనాల పార్కింగ్ ప్రాంతం నుంచి భక్తుల కదలికలను పర్యవేక్షించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

మోదీ చాలా 'టఫ్ మ్యాన్' క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు

మనీలా:మనీలాలో జరిగిన క్వాడ్ సదస్సులో మోదీని 'గట్టి వాడు'గా అభివర్ణించిన ట్రంప్ క్వాడ్ సమా వేశంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతల చర్చలు 85 మిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ యాక్సిలరేటర్ ప్రారం భమిస్తామన్న ట్రంప్ సముద్ర జలాల రక్షణ కోసం 4 దేశాల సైన్యాలతో ఉమ్మడి మిలిటరీ విన్యాసాలు అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో భారత్, జపాన్ భాగస్వామ్యాన్ని కొనియాడిన ట్రంప్ఫిలిప్పీన్స్‌లోని మనీలా వేదికగా జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత, ఆసియాన్ సదస్సు సందర్భంగా జరిగిన ఈ భేటీలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని 'టఫ్ మ్యాన్' (చాలా గట్టి వాడు)గా అభివర్ణించారు. గతంలోనూ పలు అంత ర్జాతీయ వేదికలపై మోదీ 'టఫ్ నెగోషియేటర్',



తనకంటే చాలా బెటర్ అని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. భవిష్యత్ సాంకేతికతకు దిశానిర్దేశం చేసేందుకు 85 మిలియన్ డాలర్ల నిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్సిలరేటర్'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సముద్ర జలాల్లో నియంత్రణ సామర్థ్యాలను పెంచేందుకు నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ (అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిని పెంచడంలో అమెరికాతో పాటు భారత్, జపాన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాబోయే 10 నెలల్లో తమకు అవసరమైన అన్ని వనరులు సమకూరుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.చైనా పర్యటనలో భాగంగా జిన్‌పింగ్, పుతిన్‌లతో త్రైపాక్షిక అణు చర్చలు జరిపి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తానని ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేతనిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అవకాశం ఉందని, ఇరాన్ అణ్వాయుధాలు సాధించకుండా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. మరోవైపు, ఎన్విడియా జాతీయ భద్రతా ప్రతిపాదనను స్వాగతిస్తూనే, ఇటీవల రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపడితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

ఆలయ యంత్రాంగం నిరాకరించినందువల్లే దీపం వెలిగించలేపోయాం



తమిళనాడులో మదురైలోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న వివాదాస్పద దీపస్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించలేకపోయామని తమిళ నాడు ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీపస్తంభం వద్ద దీపం వెలిగించే ందుకు ఆలయ యంత్రాంగం అనుమతి నిరాక రించడమే అందుకు కారణమని వెల్లడించింది. ఈనెల 24న దీపస్తంభంపై దీపం వెలిగిం చేం దుకు సుప్రీంకోర్టు ఇచ్చిన అనుమతి అమలుకు సంబంధించి ప్రభుత్వం ఈ మేరకు ఒక నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఏటా దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే విధించింది. అయితే, నవంబర్ 24న మాత్రం ఒకసారి దీపం వెలిగించేందుకు అనుమతి ఇచ్చింది. దీపస్తంభం సమీపంలో దర్గా ఉండడంతో ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దీపస్తం భంపై దీపం వెలిగించడం సంప్రదాయంలో భాగం కాదన్న తమిళనాడు ప్రభుత్వ వాదనను హిందూ సంఘాలు ఖండించాయి. దీపం వెలిగించే సమన్వయ బాధ్యతలు నిర్వర్తిసున్న మదురై కలెక్టర్ కృష్ణ.. సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు తాను అన్ని విధాలా ప్రయత్నించానని అందులో పేర్కొన్నారు.

యూపీలో 13.58 కోట్ల మంది ఓటర్లు.. ఎస్ఎస్ఆర్‌లో అదనంగా 18 లక్షల మంది

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో 13.58 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. దీంట్లో 6.20 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నవదీప్ రిన్వా తెలిపారు. 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇవాళ యూపీ ఎన్నికల జాబితా డ్రాఫ్ట్‌ను రిలీజ్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూపీలో సర్ ప్రక్రియ నిర్వహించారు. అయితే తాజాగా స్పెషల్ సమ్మరీ రివిజన్ పేరుతో మరోసారి ఓటర్లను లెక్కింది. సర్‌తో పోలిస్తే ఎస్ఎస్ఆర్‌లో 18 లక్షల మంది ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం ఆఫీసర్ తెలిపారు. లక్నోలోని లోక్‌భవన్‌లో మీడియాను ఉద్దేశించి రిన్వా మాట్లాడారు. ఎస్ఎస్ఆర్ డ్రాఫ్ట్‌లో సుమారు 13,58,68,905 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంట్లో 7,38,58,510 మంది పురుషులు, 6,20,06,353 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిసింది. థార్డ్ జెండర్ ఓటర్లు 4042 ఓటర్లు ఉన్నారు. అయితే తుది ఎన్నికల జాబితాను జనవరి 4వ తేదీన ప్రకటించనున్నారు.



'ఆంక్షలు విధించడం వల్ల సమస్య పరిష్కారం కాదు'- వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

దీపావళి వేడుకలతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. కేవలం ఆంక్షలు విధించడం వల్లే కాలుష్య సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పండుగల సమయంలో పాటించే ఆచారాలు, పద్ధతులను కూడా పరిశీలించాలని సూచించింది. దిల్లీ వాయు కాలుష్యంపై సుమోటోగా విచారణ జరుపుతున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. కాలుష్య సంక్షోభానికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను నిందించవద్దని హెచ్చరించింది.దిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలే ప్రధాన కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. నగరంలో పెరుగుతున్న



ట్రాఫిక్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. దిల్లీని గాజియాబాద్, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలతో కలిపే రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోందని ధర్మాసనం ప్రస్తావించింది. రోడ్లపై తిరుగుతున్న వాహనాల రకాలను పరిశీలిస్తే కాలుష్యానికి ప్రధాన కారణం అర్థమవుతుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానిం చారు. "మనం మాట్లాడుతూనే ఉంటాం. కొన్నిసార్లు ప్రకటనలు, సూచనలు చేస్తుంటాం. కానీ అసలు విషయం ఏమిటంటే ఏక్యూఐ ఇప్పటికే 400కి చేరువలో ఉంది" అని ఆయన అన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.కాలుష్య నియంత్రణ చర్యల విషయంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. రోడ్లపై ఆధారపడి జీవనోపాధి పొందే పేద ప్రజలే కాలుష్య సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ముఖ్యంగా పండుగల సమయంలోనే అనేకమందికి ఉపాధి లభిస్తుందని గుర్తుచేసింది. అందువల్ల కాలుష్య నియంత్రణ పేరుతో పేదల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ధర్మాసనం అభిప్రాయపడింది.పంట వ్యర్థాల దహనంపై రైతులకు అవగాహనపంట గడ్డిని కాల్చడం వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడానికి బదులుగా యంత్రాలను ఉపయోగించేలా ప్రోత్సహించాలని పేర్కొంది. పంట వ్యర్థాలను కాల్చడం వెనుక ఉన్న ఆర్థిక అంశాలను రైతులకు వివరించాలని తెలిపింది. ప్రత్యామ్నాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తే రైతులు పంట వ్యర్థాలను కాల్చడం మానుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

సంపాదకీయం

అందం కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టాలా?

● తెల్లటి చర్మమే అందమనే భావనతో ప్రమాదకర క్రీముల వాడకం..

అనారోగ్యానికి ఆహ్వానం పలుకుతున్న సౌందర్య ఉత్పత్తులు



తెల్లగా ఉంటేనే అందమా? నల్లగా ఉంటే అందం తక్కువా? మనిషి అందాన్ని చర్మం రంగుతో కొలవడం ఎంతవరకు సమంజసం? సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న ఈ రంగు వివక్ష ఇప్పటికీ తగ్గడం లేదు. కాలం మారుతున్నా తెల్లటి చర్మంపై మోజు మాత్రం పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యువతీ యువకులు తెల్లగా కనిపించాలనే కోరికతో రకరకాల సౌందర్య ఉత్పత్తులను ఆశ్రయిస్తున్నారు. అమ్మాయిలే కాదు, అబ్బాయిలు కూడా తమ చర్మం రంగు పట్ల అసంతృప్తితో క్రీములు, లోషన్లు వాడుతున్నారు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని సౌందర్య ఉత్పత్తుల వ్యాపార సంస్థలు భారీగా ప్రచారం చేస్తున్నాయి. అయితే అందంగా కనిపించాలనే కోరిక ఆరోగ్యానికే ముప్పుగా మారితే పరిస్థితి ఏమిటి? ఈ అంశం ఇప్పుడు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరాన్ని కల్పిస్తోంది.ఇటీవల కేరళలో ఫెయిర్‌నెస్ క్రీమ్ ఉపయోగించిన ఓ టీనేజర్ మూత్రపిండాల సమస్యకు గురైనట్లు 'ది హిందూ' పత్రికలో వచ్చిన కథనం ఆందోళన కలిగిస్తోంది. ఆమె ఉపయోగించిన క్రీమ్‌ను పరీక్షించగా అందులో 1.25 శాతం పాదరసం ఉన్నట్లు గుర్తించారు. పాదరసం అత్యంత విషపూరితమైన లోహం. ఇది చర్మం ద్వారా శరీరంలోకి చేరితే మూత్రపిండాలు, నాడీవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందంగా కనిపించాలనే ఉద్దేశంతో ఉపయోగించిన ఒక క్రీమ్ ఆరోగ్యాన్ని దెబ్బతీయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన తెలియజేస్తోంది. మార్కెట్‌లో లభించే ప్రతి సౌందర్య ఉత్పత్తి సురక్షితమైనదని భావించడం పొరపాటే.**తెల్లటి చర్మమే అందమనే భావన ఎందుకు?** మనిషి చర్మం రంగును ప్రధానంగా మెలనిన్ అనే వర్ణద్రవ్యం నిర్ణయిస్తుంది. ఇది సహజంగా చర్మంలో ఉత్పత్తి అవుతుంది. మెలనిన్ ఎక్కువగా ఉంటే చర్మం ముదురు రంగులో, తక్కువగా ఉంటే లేత రంగులో కనిపిస్తుంది. దీనికి జన్యుపరమైన అంశాలు కూడా కారణమవుతాయి. అంతేకాదు, సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల ప్రభావాన్ని తగ్గించడంలో మెలనిన్ కొంతవరకు రక్షణ కల్పిస్తుంది. అలాంటప్పుడు ముదురు రంగు చర్మాన్ని తక్కువగా చూడాల్సిన అవసరం ఏముంది? తెల్లటి చర్మం ఉన్నవారే అందంగా ఉంటారనే అభిప్రాయానికి శాస్త్రీయ ఆధారాలేవీ లేవు. అయినప్పటికీ మన సమాజంలో చర్మం రంగుకు అనవసరమైన ప్రాధాన్యత ఇస్తున్నారు.పెళ్లి సంబంధాలు చూసే సమయంలో అమ్మాయి రంగు గురించి ఆరా తీయడం ఇప్పటికీ కొనసాగుతోంది. తెల్లగా ఉంటేనే మంచి సంబంధం వస్తుందనే భావన కొందరిలో బలంగా నాటుకుపోయింది. అబ్బాయిల విషయంలోనూ తెల్లగా, అందంగా ఉండాలనే అంచనాలు పెరుగుతున్నాయి. సినిమాలు, టెలివిజన్, ప్రకటనలు ఈ ధోరణిని మరింత బలపరుస్తున్నాయి. తెల్లగా ఉంటేనే ప్రేమలో, పెళ్లిలో, ఉద్యోగంలో మంచి అవకాశాలు లభిస్తాయనే తప్పుడు అభిప్రాయాలు యువతలో ఏర్పడుతున్నాయి. చిన్నప్పటి నుంచే పిల్లల చర్మం రంగుపై వ్యాఖ్యలు చేయడం వల్ల వారిలో ఆత్మన్యూనతాభావం పెరుగుతోంది. తమ సహజమైన రూపాన్ని అంగీకరించలేక ఇతరులతో పోల్చుకుంటూ, చర్మం రంగును మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం సౌందర్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు.. సమాజంలో వేళ్లూనుకున్న రంగు వివక్షకు నిదర్శనం. **ప్రమాదకర రసాయనాలతో ఆరోగ్యానికి ముప్పు** చర్మాన్ని తెల్లగా మారుస్తామని ప్రచారం చేసే కొన్ని నాణ్యతలేని, నకిలీ క్రీముల్లో పాదరసం వంటి ప్రమాదకర రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి దీర్ఘకాలంలో మూత్రపిండాల పనితీరును దెబ్బతీయవచ్చు. మూత్రం ద్వారా ప్రొటీన్లు అధికంగా పోవడం, శరీరంలో వాపులు రావడం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. నాడీవ్యవస్థపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది. మరికొన్ని క్రీముల్లో స్టెరాయిడ్లు, హైడ్రోక్వినోన్ వంటి పదార్థాలు ఉంటాయి. వీటిలో కొన్ని చర్మ సంబంధిత వ్యాధుల చికిత్సలో వైద్యులు సూచించే ఔషధాలే అయినప్పటికీ, వైద్యుల సలహా లేకుండా ఇష్టానుసారంగా వాడటం ప్రమాదకరం. అవసరానికి మించి, ఎక్కువకాలం ఉపయోగిస్తే చర్మం పలుచబడటం, మొటిమలు రావడం, మంట, చర్మం రంగులో అసహజమైన మార్పులు వంటి సమస్యలు ఎదురవుతాయి.ముఖ్యంగా తక్షణమే తెల్లగా మారుస్తామని హామీ ఇచ్చే క్రీముల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉత్పత్తిపై ఆకర్షణీయమైన ప్రకటనలు, విదేశీ పేర్లు, అధిక ధరలు ఉన్నంత మాత్రాన అవి నాణ్యమైనవని భావించకూడదు. వాటిలో ఉపయోగించిన పదార్థాలు, తయారీ సంస్థ, నాణ్యతా ప్రమాణాల గురించి తెలుసుకోవాలి. వైద్యుల సూచన లేకుండా మందులు కలిపిన క్రీములను ఉపయోగించడం మానుకోవాలి.**సామాజిక మాధ్యమాల ప్రభావం** ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు సౌందర్య ఉత్పత్తుల ప్రచారానికి ప్రధాన వేదికలుగా మారాయి. మొబైల్ ఫోన్ తెరిస్తే చాలు.. రకరకాల క్రీముల ప్రకటనలు కనిపిస్తున్నాయి. కొందరు సామాజిక మాధ్యమ ప్రముఖులు ఒక క్రీమ్ వాడితే వారం రోజుల్లోనే చర్మం తెల్లగా మారిందంటూ ప్రచారం చేస్తున్నారు. వీటిని చూసి యువతీ యువకులు ఆకర్షితులై ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇలాంటి ప్రచారాల్లో వాస్తవం ఎంత? వాటి వెనుక వ్యాపార ప్రయోజనాలు ఏమిటి? అనే విషయాలను పరిశీలించడం లేదు.సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఫొటోలు, వీడియోల్లో ఫిల్టర్లు, ఎడిటింగ్ ఎక్కువగా ఉంటాయి. వాస్తవ రూపానికి, తెరపై కనిపించే రూపానికి ఎంతో తేడా ఉంటుంది. అయినప్పటికీ వాటిని నిజమైన అందంగా భావించి తమ రూపాన్ని మార్చుకోవాలని యువత ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా యుక్తవయసులో పిల్లలు ఇతరులతో పోల్చుకోవడం, తమ రూపం పట్ల అసంతృప్తికి లోనవడం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో తప్పుడు ప్రకటనలు వారిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అందుకే సౌందర్య ఉత్పత్తుల ప్రకటనల విషయంలో ప్రజల్లో అవగాహన పెంచడం అవసరం.**బాధ్యత తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వానిదే!** తెల్లటి చర్మమే అందమనే భావనను మార్చాల్సిన బాధ్యత కుటుంబాల నుంచి ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు పిల్లల చర్మం రంగును ఇతరులతో పోల్చకూడదు. నల్లగా ఉన్నావు, ఎండలో తిరిగితే ఇంకా నల్లబడతావు వంటి మాటలు వారిలో ఆత్మన్యూనతాభావాన్ని పెంచుతాయి.

ప్రతి ఒక్కరి చర్మం రంగు సహజమైనదని, అందులో తక్కువ ఎక్కువలు లేవని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. పాఠశాలలు, కళాశాలల్లోనూ చర్మ ఆరోగ్యం, సౌందర్య ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వం కూడా నాణ్యతలేని, నకిలీ సౌందర్య ఉత్పత్తుల విక్రయాలపై కఠిన నిఘా పెట్టాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయించే ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించాలి. నిషేధిత రసాయనాలు కలిగిన క్రీములను గుర్తించి వాటి విక్రయాలను అరికట్టాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలపై చర్యలు తీసుకోవాలి. సౌందర్య ఉత్పత్తుల తయారీ సంస్థలు కూడా వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యతా ప్రమాణాలను పాటించాలి.

మహిళల భద్రత మాటలకే పరిమితం!

చట్టాలు కఠినం.. అమలులో నిర్లక్ష్యం। న్యాయం కోసం బాధితుల పోరాటం.. నిందితులకు రాజకీయ అండ



మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవం. మహిళలకు సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ, భద్రత కల్పించాలని ప్రపంచ దేశాలు ప్రతిజ్ఞ చేసే రోజు. మహిళా సాధికారత, ఆడపిల్లల రక్షణ పేరుతో పాలకులు ఎన్నో హామీలు ఇస్తున్నారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' వంటి నినాదాలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, వేధింపులు ఆగడం లేదు. నిర్భయ ఘటన తర్వాత కఠిన చట్టాలు తీసుకొచ్చినా, వేగవంతమైన విచారణకు హామీలు ఇచ్చినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదు. మహిళలకు భద్రత కల్పించాల్సిన వ్యవస్థలే కొన్ని సందర్భాల్లో బాధితులకు న్యాయం అందించడంలో విఫలమవుతున్నాయి.ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ బాలికపై లైంగికదాడి కేసులో దోషిగా తేలాడు. న్యాయం కోసం పోరాడిన బాధితురాలి తండ్రి పోలీసుల అదుపులో మరణించడం, ఆమె ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు బంధువులు ప్రాణాలు కోల్పోవడం వ్యవస్థల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తాయి. బాధితురాలికే రక్షణ కల్పించలేని పరిస్థితి ఉంటే సామాన్య మహిళలకు భద్రత ఎలా లభిస్తుంది? హత్రాస్‌లో 2020లో పందొమ్మిదేళ్ల దళిత యువతిపై జరిగిన లైంగికదాడి, అనంతరం ఆమె మరణం దేశాన్ని కుదిపేసింది. కుటుంబ సభ్యుల అభీష్టానికి విరుద్ధంగా అర్ధరాత్రి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మానవ హక్కుల పరిస్థితిని ప్రశ్నార్థకం చేసింది. ఈ ఘటనలో న్యాయ ప్రక్రియ కూడా బాధిత కుటుంబానికి పూర్తిస్థాయి భరోసా కల్పించలేకపోయింది. జమ్మూకశ్మీర్‌లోని కతువాలో ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడి చేసి హత్య చేసిన ఘటన మరోసారి మహిళల భద్రతపై ఆందోళన కలిగించింది. నిందితులకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించడం, అందులో అప్పటి బీజేపీ మంత్రులు పాల్గొనడం మరింత దారుణం. నేరానికి పాల్పడిన వారిని శిక్షించాల్సిన సమయంలో రాజకీయ మద్దతు పలకడం సమాజానికి తప్పుడు సంకేతాలను పంపుతుంది. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగికదాడికి పాల్పడిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ముందుగానే ఫిర్యాదులు అందినా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదు. ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చింది. నెలల తరబడి హింస కొనసాగుతున్న సమయంలో పాలకుల మౌనం తీవ్ర విమర్శలకు దారితీసింది.గుజరాత్ అల్లర్ల సమయంలో ఐదు నెలల గర్భిణి బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడికి పాల్పడటంతో పాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో పదకొండు మందికి జీవిత ఖైదు విధించగా, 2022లో గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేసింది. జైలు నుంచి బయటకు వచ్చిన దోషులకు పూలమాలలతో స్వాగతం పలకడం మహిళల గౌరవాన్ని అవమానించడమే. బిల్కిస్ బానో న్యాయం కోసం చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా 2024లో సుప్రీంకోర్టు వారి విడుదలను రద్దు చేసి తిరిగి జైలుకు పంపాలని ఆదేశించింది. అయినప్పటికీ ఇటీవల మరో ఇద్దరు దోషులకు బెయిల్ మంజూరు కావడంతో ఆమె ప్రాణభయంతో రాష్ట్రాన్ని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాధితురాలికి భరోసా కల్పించాల్సిన వ్యవస్థలు ఆమెకు భద్రతపై నమ్మకం కలిగించలేకపోవడం ఆందోళనకరం.మరోవైపు రెండు లైంగికదాడి కేసుల్లో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్‌కు హర్యానా ప్రభుత్వం పదేపదే పెరోల్ మంజూరు చేస్తోంది. 2017 నుంచి 2026 ఆగస్టు నాటికి ఆయన 17వసారి తాత్కాలిక విడుదల పొందడం విమర్శలకు తావిస్తోంది. బాధితులు న్యాయం కోసం సంవత్సరాల తరబడి పోరాడుతుంటే, నేరాలకు పాల్పడిన దోషులకు పదేపదే వెసులుబాట్లు కల్పించడం న్యాయవ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు కలిగిస్తుంది.జాతీయ స్థాయిలో నమోదవుతున్న లైంగికదాడి కేసుల సంఖ్య కూడా పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. 2013 నుంచి 2024 వరకు దేశవ్యాప్తంగా సుమారు 3.92 లక్షల లైంగికదాడి కేసులు నమోదయ్యాయి. ఇవి పోలీసులకు అందిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన కేసులు మాత్రమే. భయం, సామాజిక ఒత్తిడి, కుటుంబ పరువు, నిందితుల బెదిరింపుల కారణంగా బయటకు రాని ఘటనలు మరెన్నో ఉన్నాయి. మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పుకోవడానికి కూడా భయపడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశానికి పతకాలు సాధించిన క్రీడాకారిణులు ఢిల్లీలో నెలల తరబడి ఆందోళన చేయాల్సి వచ్చింది. న్యాయం కోసం రోడ్డెక్కిన మహిళా క్రీడాకారిణులపై పోలీసుల బలవంతపు చర్యలు పాలకుల వైఖరిని ప్రశ్నార్థకం చేశాయి. 2026లో కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించగా, రెజ్లర్లు అప్పీలు చేస్తామని ప్రకటించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో నిష్పాక్షిక విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.మహిళల రక్షణ కోసం దేశంలో నిర్భయ చట్టం, పోక్సో చట్టం, గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటి అనేక చట్టాలు అమల్లో ఉన్నాయి. అయినప్పటికీ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం నుంచి న్యాయం పొందే వరకు అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నారు. కేసుల విచారణలో జాప్యం, సాక్ష్యులపై బెదిరింపులు, బాధిత కుటుంబాలకు రక్షణ లేకపోవడం, నిందితులకు రాజకీయ పలుకుబడి ఉండటం వంటి అంశాలు న్యాయ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయి. చట్టాలు పుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలైనప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది.మహిళల భద్రత అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. మహిళల దుస్తులు, స్వేచ్ఛ, ప్రేమ, జీవన విధానాలపై ఆంక్షలు విధిస్తూ, వారిపై దాడులకు పాల్పడే నిందితుల విషయంలో మౌనం వహించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. పురుషాధిక్య భావజాలం, కులమత ఆధిపత్య ధోరణులు మారనంతవరకు మహిళలపై హింసకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. చిన్నతనం నుంచే ఆడపిల్లలు, మగపిల్లలకు సమానత్వం, పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛపై అవగాహన కల్పించాలి.ప్రభుత్వాలు మహిళల భద్రతకు సంబంధించి ఇచ్చే హామీలను కార్యాచరణలో చూపించాలి. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి. బాధితులకు, వారి కుటుంబాలకు పోలీసు రక్షణ కల్పించాలి. కేసుల విచారణను వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలి. ముఖ్యంగా నేరస్తుడి రాజకీయ హోదా, కులం, మతం, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా చట్టం సమానంగా పనిచేయాలి. మహిళల భద్రత పేరుతో ఉత్సవాలు, సభలు, నినాదాలు నిర్వహించడం కంటే వారికి నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించడమే పాలకుల ముందున్న అసలైన బాధ్యత. మాటల్లో మహిళా సాధికారతను ప్రస్తావించడం కాదు.. చేతల్లో భద్రత, సమానత్వం, న్యాయం అందించినప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది.

అమెరికాపై ఇరాన్ క్షిపణి పట్టు!

యెమెన్‌లో హౌతీల ఆధిపత్యం.. ఎర్ర సముద్రంపై పెరుగుతున్న పట్టు - పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాలు



పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. ముఖ్యంగా క్షిపణి, డ్రోన్ వ్యవస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు సంస్థ కూడా ప్రాంతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగింది. ఇరాన్ మద్దతుతో హౌతీలు ఆధునిక క్షిపణులు, డ్రోన్లను సమకూర్చుకుని ఎర్ర సముద్రంలో నౌకాయానానికి సవాళ్లు విసురుతున్నారు. దీంతో అమెరికా సహా పశ్చిమ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.ఇరాన్ వద్ద మధ్యప్రాచ్యంలోనే అతిపెద్ద, వైవిధ్యభరితమైన క్షిపణి నిల్వలు ఉన్నాయి. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో పాటు దీర్ఘశ్రేణి డ్రోన్లను కూడా అభివృద్ధి చేసింది. ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకుంది. అయితే అమెరికా భూభాగాన్ని నేరుగా తాకగల క్షిపణిని ఇరాన్ ఇప్పటివరకు పరీక్షించలేదని అంతర్జాతీయ రక్షణ పరిశోధనా సంస్థలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ క్షిపణి సాంకేతికతలో ఇరాన్ సాధిస్తున్న పురోగతి అమెరికాకు వ్యూహాత్మక సవాలుగా మారుతోంది.ఇరాన్ తన సైనిక ప్రభావాన్ని కేవలం సొంత భూభాగానికే పరిమితం చేయకుండా మిత్రదేశాలు, ప్రాంతీయ సాయుధ సంస్థల ద్వారా విస్తరిస్తోంది. లెబనాన్‌లో హిజ్బుల్లా, యెమెన్‌లో హౌతీలు, ఇతర ప్రాంతాల్లోని సాయుధ సంస్థలకు ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ అందిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తోంది. ఈ నెట్‌వర్క్ ద్వారా ప్రత్యర్థి దేశాలపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని అనుసరిస్తోంది.యెమెన్‌లో హౌతీల ఎదుగుదల ఈ పరిణామాల్లో అత్యంత కీలకమైనది. మొదట స్థానిక తిరుగుబాటు శక్తిగా ప్రారంభమైన ఈ సంస్థ క్రమంగా సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంది. యెమెన్‌లోని కీలక ప్రాంతాలతో పాటు ఎర్ర సముద్ర తీరంలోని హొదైదా ఓడరేవుపై నియంత్రణ సాధించింది. ఇరాన్ నుంచి అందుతున్న సాంకేతిక సహకారం, ఆయుధాల సరఫరాతో బాలిస్టిక్ క్షిపణులు, నౌకావ్యతిరేక క్షిపణులు, డ్రోన్లను వినియోగించే స్థాయికి చేరుకుంది. ఈ సామర్థ్యం వల్ల హౌతీలు తమ దేశ సరిహద్దులు దాటి ప్రాంతీయ భద్రతను ప్రభావితం చేయగలుగుతున్నారు.ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ఎర్ర సముద్రం, బాబ్ అల్ మండెబ్ జలసంధి హౌతీల వ్యూహంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆసియా, యూరప్ మధ్య సముద్ర వాణిజ్యానికి ఈ మార్గం ఎంతో ముఖ్యమైనది. ఇక్కడ నౌకలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరగడం వల్ల అంతర్జాతీయ రవాణా వ్యవస్థ దెబ్బతింటోంది. నౌకలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో రవాణా ఖర్చులు, బీమా వ్యయాలు పెరుగుతున్నాయి. ప్రపంచ సరఫరా వ్యవస్థపైనా దీని ప్రభావం పడుతోంది.హౌతీల దాడులను అడ్డుకునేందుకు అమెరికా, బ్రిటన్ సైనిక చర్యలు చేపట్టాయి. హౌతీల స్థావరాలు, ఆయుధ నిల్వలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించాయి. ఇజ్రాయెల్ కూడా యెమెన్‌లోని కీలక ప్రాంతాలపై వైమానిక దాడులు చేసింది. అయినప్పటికీ హౌతీల సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీయలేకపోయాయి. పర్వత ప్రాంతాల్లో ఆయుధాలను దాచడం, రహస్య స్థావరాల నుంచి కార్యకలాపాలు నిర్వహించడం వల్ల వారిని నియంత్రించడం కష్టమవుతోంది. ఇరాన్–హౌతీల సంబంధం కూడా అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ ఆయుధాలు, శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నప్పటికీ హౌతీలు తమకంటూ ప్రత్యేక రాజకీయ, సైనిక లక్ష్యాలను కలిగి ఉన్నారు. ప్రతి నిర్ణయానికీ ఇరాన్ ఆదేశాలే కారణమని చెప్పలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ ఇరాన్ మద్దతు వల్ల హౌతీల సామర్థ్యం గణనీయంగా పెరిగిందనే విషయంలో సందేహం లేదు.అమెరికాకు ఇరాన్ నేరుగా సైనిక సవాలు విసరడంతో పాటు హౌతీల ద్వారా సముద్ర వాణిజ్య మార్గాలపై ఒత్తిడి తీసుకురాగలగడం ఒక ముఖ్యమైన వ్యూహాత్మక అంశం.

అయితే ఈ వ్యూహం ఇరాన్‌కు కూడా ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. హౌతీల కార్యకలాపాలు విస్తరిస్తే సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలతో ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉంది. అదే సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ఇరాన్ మిత్ర శక్తులపై మరింత ఒత్తిడిని పెంచవచ్చు.మొత్తంగా చూస్తే ఇరాన్ క్షిపణి సామర్థ్యం, యెమెన్‌లో హౌతీల సైనిక ఆధిపత్యం పశ్చిమాసియా భద్రతా సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా సైనిక బలం ఉన్నప్పటికీ తక్కువ వ్యయంతో పనిచేసే డ్రోన్లు, క్షిపణులు, ప్రాంతీయ మిత్ర శక్తుల ద్వారా ఇరాన్ కొత్త తరహా సవాళ్లు విసురుతోంది.

గురువారం,
నవంబర్ 26, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

మహా విష్ణువు నామాల్లో అత్యంత విశిష్టమైన 'దామోదర' నామం- కార్తిక మాసంలో తప్పక తెలుసుకోవాల్సిన విశేషాలు ఇవే!

కార్తిక మాసాన్ని 'దామోదర మాసం' అని కూడా అంటారు. ఈ మాసంలో శ్రీ మహా విష్ణువు దామోదరుడిగా విశ్వమంతా వ్యాపించి ఉంటాడు. అందుకే ఈ మాసానికి దామోదర మాసమని పేరు వచ్చింది. శ్రీ మహా విష్ణువు నామాల్లో 'దామోదర' అనే నామం అత్యంత విశిష్టమైనది. ప్రత్యేకించి ఈ మాసంలో దామోదర లీల గురించి చదివినా, విన్నా మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. ఇంతకూ ఏమిటి దామోదర లీల? శ్రీ మహా విష్ణువుకు దామోదరుడనే పేరు ఎలా వచ్చింది? ఈ వివరాలు తెలుసుకుందాం.



దామోదరుడు అంటే?

దామోదరుడు అంటే, 'దామ' అంటే తాడు, 'ఉదరము' అనగా పొట్ట. అనగా పొట్టకు తాడుతో కట్టి ఉన్నవాడు అని అర్థం. మరో అర్థం ప్రకారం దమము అంటే లోకాలు అని, లోకాలన్నీ తన ఉదరంలో కలిగినవాడని అర్థం. ఏది ఏమైనా శ్రీ మహా విష్ణువుకు ప్రీతికరమైన కార్తిక మాసాన్ని దామోదర మాసమని కూడా అంటారు. ఇంతకూ స్వామి దామోదరుడనే పేరు ఎలా వచ్చింది? శ్రీకృష్ణావతారంలో స్వామి దామోదర లీల విశిష్టత ఏమిటో చూద్దాం.

శ్రీకృష్ణుని బాల్యక్రీడలు

గోకులంలో చిన్న కృష్ణుడు ఎన్నో లీలా విశేషాలు చేశాడు. గోపికల ఇళ్లల్లో పాలు, వెన్న, నెయ్యి దొంగతనంగా తినడం ఆయన లీలా విశేషాల్లో భాగమే! చిన్నతనంలో కృష్ణుడు గోకులంలో అల్లరి చేస్తూ, వెన్న కుండలను పగలగొట్టి, ఆ వెన్నను తోటి పిల్లలకు, కోతులకు పంచేవాడు.

యశోద కోపం- బంధనం

ఒకరోజు యశోదమ్మ వెన్న చిలుకుతుండగా కృష్ణుడు పాలు కావాలని మారం చేశాడు. చిన్ని కృష్ణుని ఒళ్లో పడుకోబెట్టుకుని యశోదమ్మ పాలివ్వసాగింది. ఇంతలో పొయ్యిమీద పెట్టిన పాలు పొంగి పోతుండటంతో యశోద కృష్ణుడిని కిందకి దించి పాలు ఆపేందుకు లోనికి వెళ్లింది. తాను పాలు తాగుతుండగా అర్ధాంతరంగా తల్లి వదిలేసి వెళ్లిందన్న కోపంతో కృష్ణుడు లోనికి వెళ్లి వెన్న కుండను పగలగొట్టి పక్కన కూర్చున్నాడు.

భగవంతుని బంధించడానికి సరిపోని తాడు

తిరిగి వచ్చిన యశోదమ్మ కృష్ణుడు చేసిన పనికి కోపగించుకుని కృష్ణుని తాడుతో రోటికి కట్టాలని ప్రయత్నించింది. ఇంట్లో ఉన్న తాడుతో కృష్ణుని కట్టబోతే సరిగ్గా రెండ ంగుళాలు తగ్గింది. అలా ఎన్ని తాళ్లు తెచ్చి ఎన్ని మార్లు ప్రయత్నించినా సరిగ్గా రెండంగుళాలు తగ్గసాగింది. ఆమె ఎన్ని తాళ్లు జత చేసినా కృష్ణుడిని కట్టడానికి తాడు సరిపోలేదు.

ప్రేమకు వశమగుట

తల్లి పడుతున్న శ్రమను చూసి కన్నయ్య ఆమెపై ప్రేమతో చివరకు ఆమెచే తనను తాను బంధించుకోవడానికి అంగీకరించాడు. అంటే యోగులకు, జ్ఞానులకు అందనటువంటి పరమాత్ముడు కేవలం తల్లి ప్రేమ అనే భక్తికి తలవంచి బందీ అయ్యాడు. ఇది ఎంత అద్భుతమో కదా! ఎట్టకేలకు యశోదమ్మ చిన్న కృష్ణుని రోటికి కట్టేసి, నిశ్చింతగా లోనికెళ్లింది.

నలకూబర మణిగ్రీవులకు శాపవిముక్తి

రోటికి తాళ్లతో కట్టిన చిన్ని కృష్ణుడు ఊరుకోలేదు. అలానే రోలును లాగుకుంటూ ముందుకెళ్లసాగాడు. అలా వెళ్లిన కృష్ణుడు, అక్కడే ఉన్న పెద్ద పెద్ద మద్ది వృక్షాల మధ్య నుంచి వెళ్లగా ఆ చెట్లు పెద్ద శబ్దంతో కూలిపోయి అందులో నుంచి ఇద్దరు దివ్య పురుషులు బయటకు వస్తారు. వారు శ్రీకృష్ణునికి నమస్కరించి అంతర్ధానం అవుతారు. చిన్ని కృష్ణుడు ఆ చెట్ల రూపంలో ఉన్న కుబేరుని కుమారులైన నలకూబర మణిగ్రీవులకు శాపవిముక్తి ప్రసాదించాడు.

ఎవరీ నలకూబర మణిగ్రీవులు

నలకూబరుడు, మణిగ్రీవుడు సంపదలకు అధిపతి అయిన కుబేరుని కుమారులు. దేవలోకంలో ఉన్న సమయంలో వీరు తమ ఐశ్వర్యంతో అహంకారంతో మదించి ప్రవర్తించారు. ఒకసారి నదీతీరంలో అప్సరసలతో కలిసి మద్యం మత్తులో విలాసాల్లో మునిగి తేల ుతూ నారద మహర్షి వెళుతున్న విషయాన్ని కూ గమనించకుండా అమర్యాదగా ప్రవర్తిస్తారు. నారదుని శాపంనలకూబర మణిగ్రీవుల అహంకారాన్ని తగ్గించడానికి, ధనమత్తులో పడి సత్ప్రవర్తన మరిచిన ఆ ఇద్దరినీ నారద మహర్షి "మర్త్యలోకంలో అనగా భూమిపై పెద్ద మద్ది చెట్లుగా పడి ఉండమని" శపిస్తాడు. వెంటనే నలకూబర మణిగ్రీవులు పశ్చాత్తాపం చెంది శాపానికి ఉపశమనం కోరగా, ద్వాపర యుగంలో భగవంతుడైన శ్రీకృష్ణుని స్పర్శతో వారికి శాపవిమోచనం కలుగుతుందని నారదుడు అనుగ్రహిస్తాడు. ఆ విధంగా కుబేరుని కుమారులైన నలకూబర మణిగ్రీవులకు చిన్ని కృష్ణుని స్పర్శచేత శాపం తొలగి తిరిగి వారు దేవలోకానికి చేరుకుంటారు. శ్రీకృష్ణుడు ప్రదర్శించిన ఈ లీలను దామోదర లీల అంటారు.

దామోదర లీల విశిష్టత

సృష్టికర్త అయిన శ్రీ మహావిష్ణువు, జగన్నాథుడు కూడా తల్లి యశోద ప్రేమ ముందు చిన్న బాలుడిగా మారి తల్లిచే కట్టబడటం ద్వారా, భగవంతుడిని బలంతో కాదు, కేవలం భక్తితో, నిర్మలమైన బంధించగలమని నిరూపించాడు.

కార్తిక మాసంతో సంబంధం

ఈ దామోదర లీల కార్తీక మాసంలో జరిగిందని

మేకప్ వేసుకుంటున్నారా? - ఈ "ప్రొడక్ట్స్‌ను" వేరే వాళ్లతో షేర్ చేసుకోకూడదట!



అందంగా మెరిసిపోవాలని అందరికీ ఉంటుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ ఆశ ఎక్కువ. అందుకే ముఖానికి మేకప్ వేసుకుంటుంటారు. ఇంతవరకు బానే ఉన్నా ఒకటో మేకప్ కిట్‌ను ఇంటిల్లిపాది వాడుతుంటారు. అంతేకాకుండా ఫ్రెండ్స్ కూడా షేర్ చేసుకుంటుంటారు. మరి మీరు కూడా ఇంతేనా అయితే జాగ్రత్త అంటున్నారు సౌందర్య నిపుణులు. ఇలా ఒకరి ప్రొడక్ట్స్?ను మరొకరు యూజ్? చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు. ఈ క్రమంలోనే ఏఏ బ్యూటీ ప్రొడక్ట్స్? ఇతరులతో షేర్? చేసుకోకూడదో ఈ స్టోరీలో చూద్దాం.

పౌడర్ రూపంలో ఉంటే: ఫౌండేషన్, ఐ షాడో వంటి కొన్ని ఉత్పత్తులు పౌడర్ రూపంలో ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువని హెచ్చరిస్తున్నారు. వీటి కారణంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చంటున్నారు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు షేర్? చేసుకోకూడదని సూచిస్తున్నారు.

లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్: చాలా మంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని షేర్? చేసుకోవడం వల్ల వాటిపై ఉండే బ్యాక్టీరియా పెదవుల పైకి చేరి హాని కలిగిస్తుందని చెబుతున్నారు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారే ఉపయోగించుకోవడం శ్రేయస్కరమంటున్నారు.

ఐ ప్రొడక్ట్స్?: ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి కళ్ల సంబంధిత ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా వేరేవారివి ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా ఐ ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అదే విధంహా ఆ ప్రొడక్ట్స్?లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రగా మారడం, నీళ్లు కారడం, మండటం వంటి కూడా ఇబ్బందిపెడతాయంటున్నారు. కాబట్టి వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదని చెబుతున్నారు.మూతలు ఉండేవి: కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు.. మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో దొరుకుతుంటాయి. అయితే వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదంటున్నారు. ఇలా షేర్ చేసుకోవడం వల్ల వారు యూజ్? చేసినప్పుడు వారి చేతుల్లో ఉండే హానికారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుందని.. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుందంటున్నారు.మేకప్ బ్రష్‌లు: మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా వేరే వారితో షేర్? చేసుకోకూడదని నిపుణులు చెబుతున్నాపు. ఎందుకంటే ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాకుండా, మనం వాటిని తిరిగి వాడినప్పుడు చర్మం మీదకు కూడా చేరతాయంటున్నారు. కాబట్టి మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిదంటున్నారు. పై వాటితో పాటు లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు, మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు మొదలైనవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది అంటున్నారు నిపుణులు.: ఇక్కడ మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

స్లీప్ మాస్క్‌లు ధరించి నిద్రపోతున్నారా ఈ జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు తప్పదట!



సంపూర్ణ నిద్ర వల్ల కలిగే లాభాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ ప్రస్తుత పరిస్థితులు మారిపోతున్నాయి. మారిన జీవనశైలి, పని ఒత్తిడి, పెరిగిన ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం కారణంగా ఎక్కువ మంది తగినంత నిద్రపోవట్లేదు. అంతేకాకుండా గదిలో వెలుతురు కూడా నిద్రలేమికి మరో కారణంగా చెప్పవచ్చు. ఈ క్రమంలోనే సరైన నిద్రకోసం చాలా మంది స్లీప్ మాస్క్‌లు ఉపయోగిస్తున్నారు. వీటిని ధరించడం వల్ల మంచి నిద్ర పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతవరకు బానే ఉన్నా ఎప్పుడో ఒకసారి వీటిని వాడితే పర్లేదు కానీ, రెగ్యులర్?గా యూజ్ చేస్తుంటే మాత్రం వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఇబ్బందిపెడతాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే స్లీప్? మాస్క్‌లు ఉపయోగించడం వల్ల ఎదురయ్యే సమస్యలతో పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన వివరాలు ఈ స్టోరీలో చూద్దాం. సాధారణంగా నిద్రలో అటు ఇటు దొర్లడం కామన్?. అయితే స్లీప్? మాస్క్? ధరించి నిద్రపోయేటప్పుడు దొర్లడం వల్ల చర్మం రాపిడికి గురవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా అక్కడి చర్మం గరుకుగా మారడం, ఎరుపెక్కడం, దురద వంటివి రావచ్చంటున్నారు.సింథటిక్ మెటీరియల్స్‌తో రూపొందించిన మాస్కులను ధరించడం వల్ల కళ్లు, కళ్ల చుట్టూ ఉండే చర్మానికి గాలి తగలదని.. ఫలితంగా అక్కడ చెమట, జిడ్డు పేరుకుపోయి పొక్కులొస్తాయంటున్నారు. ఇక అలర్జీ సమస్య కూడా వేధించే అవకాశాలున్నాయంటున్నారు.మానవ శరీరంలో అత్యంత సున్నితమైన భాగం కళ్లు. అయితే సున్నితంగా ఉండే కళ్లపై బిగుతైన స్లీప్? మాస్క్?లు పెట్టడం వల్ల అక్కడి చర్మానికి గాలి ఆడక, రాపిడికి గురై నల్లగా మారుతుందని.. ఫలితంగా హైపర్ పిగ్మెంటేషన్ సమస్య కూడా వేధించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.చూడగానే కొనాలి అనిపించేలా స్లీప్ మాస్క్‌లు తయారు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వీటి తయారీలో కృత్రిమ రంగులు, సువాసనలు వెదజల్లే పరిమళాలు, కెమికల్స్ యూజ్ చేస్తుంటారు. అయితే ఇందులో వాడే కొన్ని రసాయనాలు కళ్ల చుట్టూ ఉండే చర్మానికి, కళ్లకు హాని కలిగించి అలర్జీలకు కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ జాగ్రత్తలు తప్పనిసరి: స్లీప్‌మాస్కులు మంచి నిద్రను అందించడంలో ముందు ఉన్న సరైన పద్ధతిలో ధరించకపోవడం వల్ల కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టే అవకాశం ఉందంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు. అవేంటంటే..కంటి ఆకృతికి సరిపోలేలా కర్వీగా ఉండే కాంటూర్డ్ స్లీప్‌మాస్కులు ఉపయోగిస్తే కళ్లు, కనురెప్పలపై ఒత్తిడి పడకుండా ఉంటుందని.. నిద్ర కూడా చక్కగా పడుతుందని చెబుతున్నారు.సింథటిక్, సిల్క్ కాటన్. ఇలా వివిధ మెటీరియల్స్‌తో రూపొందించిన స్లీప్‌మాస్కులు అందుబాటులో ఉన్నాయని.. ఇందులో కాటన్‌తో తయారైనవి మంచిదంటున్నారు. ఎందుకంటే, ఇవి చెమటను పీల్చుకొని కళ్ల చుట్టూ పొక్కులు, వైట్‌హెడ్స్, పిగ్మెంటేషన్ వంటి సమస్యలు రాకుండా రక్షణ కల్పిస్తాయని చెబుతున్నారు. అలాగే అక్కడి చర్మానికీ గాలి తగులుతుందని వివరిస్తున్నారు.ఫేస్‌మాస్క్ మరీ టైట్?గా ఉండకుండా, ఎలాస్టిక్‌తో రూపొందించినవి, అడ్జస్ట్ చేసుకునేందుకు వీలుగా ఉన్నవి ఎంచుకోవడం మేలని సూచిస్తున్నారు.

కెమికల్? ఫ్రీ, సుగంధ పరిమళాలు యూజ్? చేయకుండా తయారు చేసిన మాస్కులు వాడాలని సలహా ఇస్తున్నారు. వీటి వల్ల కళ్లు, అక్కడి చర్మంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.మాస్కులను ధరించడం మాత్రమే కాదు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు. ఇలా చేయడం వల్ల వాటిపై పేరుకున్న దుమ్మూ -ధూళి, జిడ్డు తొలగిపోతాయని, ఫలితంగా కళ్లు, ఆ ప్రదేశంలోని చర్మంపై ప్రతికూల పడకుండా జాగ్రత్తపడవచ్చంటున్నారు.

రాత్రి నిద్రించే ముందు కొందరు నైట్‌క్రీమ్ వంటివి అప్లై చేసుకుంటుంటారు. ఇలాంటి వారు బిగుతుగా ఉన్న మాస్క్ ధరించి పడుకూడదని చెబుతున్నారు. ఎందుకంటే మాస్కులు టైట్?గా ఉండటం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు, వైట్‌హెడ్స్ వంటివి వచ్చే అవకాశాలు ఎక్కువంటున్నారు. అందుకే గాలి తగిలేలా కాస్త వదులుగా ఉన్నవి ఎంచుకోవడం మేలంటున్నారు. అయితే ఎగ్జిమా వంటి స్కిన్? అలర్జీ ఉన్నవారు, కంటి సంబంధిత శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు వీటిని ధరించే విషయంలో డాక్టర్ సలహా తీసుకోవడం తప్పనిసరి అని చెబుతున్నారు.

వ్యాపారంలో నష్టాలా?- ఈ ఆచారాలు పాటిస్తే లాభాలు మీ సొంతం!



నవగ్రహాలలో బుధునికి, వారాల్లో బుధవారానికి గణనాథుడు అధినాయకుడు. విద్య, వ్యాపారం వంటి వాటిల్లో రాణించాలంటే వినాయకుని పూజించాలని గణేశ పురాణంలో వివరించి ఉంది. విజయాల్లో గుర్తురాని దైవం, అపజయాల్లో గుర్తు రావడం మానవ సహజ నైజం. వ్యాపారం తీవ్రమైన నష్టాల్లో ఉన్నప్పుడు, అభివృద్ధి కుంటుపడిన సమయంలో కొన్ని ప్రత్యేక పరిహారాలు పాటించడం ద్వారా వ్యాపారాన్ని లాభాల బాటలో నడిపించవచ్చునని జ్యోతిష్య శాస్త్ర పండితులు చెబుతున్నారు. ఇంతకూ ఆ పరిహారాలేంటి? ఎలా పాటించాలి అనే విషయాలు చూద్దాం.

వక్రతుండ మహాకాయ!

ఈ విశ్వంలో వ్యాపించి ఉన్న సమస్త ప్రకృతి అనేక గణాల సమ్మేళనం. ఈ గణాలకు సర్వోన్నత చైతన్య శక్తిని అందించే నాయకుడు వినాయకుడు. అలాగే వినాయకుడు బుద్ధికి, జ్ఞానానికి, సూక్ష్మ గ్రహణ శక్తికి కారకుడు. సిద్ధి తత్వానికి, బుద్ధిమతానికి అధిష్టాన దైవం గణనాథుడు. సంస్కృతంలో 'తుండం' అంటే 'ఖండించడం' అని అర్థం. కాలాన్ని, జీవులను నియంత్రిస్తూ జీవన గమనంలో ఏర్పడే అన్ని వక్రతులను తొలగించి విజయాలను అందించేవాడు. అందుకే 'వక్రతుండం' అనేది వినాయకునికి సార్థక నామధేయమైంది.

అధిదేవుడుగణపతి బుధవారానికి, బుధ గ్రహానికి అధిపతి. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం బుధ గ్రహం అనుకూలంగా లేకపోతే విద్య, వ్యాపారాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. విద్యార్థులకు విద్యలో ఏకాగ్రత, శ్రద్ధ లోపించడం, వ్యాపారంలో ధననష్టం సంభవించడం, పురోగతి లేకపోవడం వంటి సమస్యలు ఎదు రవుతాయి. ఇలాంటప్పుడు బుధవారం కొన్ని శక్తివంతమైన పరిహారాలు పాటించడం వల్ల ఈ సమస్యలను అధిగమించవచ్చునని పండితులు చెబుతున్నారు. ఆ పరిహారాలేంటో చూద్దాం.

శుభ లాభాలను కలిగించే సిద్ధి గణపతి

వ్యాపారంలో ఎదురయ్యే నష్టాలను తగ్గించి, అధిక లాభాలను పొందడానికి బుధవారం రోజున గణపతిని ఆరాధించడం చాలా విశేషమైనది. దీనికి కారణం బుధుడు వ్యాపార కారకుడు, గణపతి బుధ గ్రహానికి అధిపతి. అందుకే బుధవారం గణపతిని పూజించడం ద్వారా వ్యాపార వృద్ధి కలుగుతుంది.

మరకత గణపతి

ముందుగా బుధవారం రోజు వ్యాపారం స్థానంలో మరకత గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించుకోవాలి. నవరత్నాలలో 'మరకతం' అంటే పచ్చ కూడా ఒక రత్నం. దీనితో తయారు చేసిన గణపతినే మరకత గణపతి అంటారు. అయితే గణపతిని తయారు చేసే పచ్చ పూర్తిగా మేలు రకమైనదే ఉండాలి.

చిన్న విగ్రహమే మేలు

అంగుష్ఠం అంటే బొటనవేలంత పరిమాణంలో ఉండే గణపతిని మాత్రమే ప్రతిష్టించుకోవాలి. అంతకన్నా చిన్నదైనా ఫరవాలేదు కానీ పెద్దగా మాత్రం ఉండరాదు. గణపతి విగ్రహం ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్త తప్పనిసరి.

పూజా విధానం

ముందుగా ఒక ప్రమిదలో 3 ఒత్తులు వేసి, కొబ్బరి నూనెతో దీపారాధన చేయాలి. మరకత గణపతిని చెరుకు రసంతో అభిషేకించాలి. అనంతరం తిరిగి గంగాజలంతో లేదా శుద్ధ జలంతో గణనాథుని అభిషేకించాలి. గంధం, కుంకుమలతో గణపతిని అలంకరించాలి. గణపతికి ప్రీతిపాత్రమైన గరికె సమర్పించాలి. గణనాథుని షోడశనామాలతో పూజించాలి.

గరిక పూసలతో పూజ

21 గరిక పూసలను సిద్ధం చేసుకోవాలి. "ఓం శ్రీం హ్రీం క్లీం గ్లౌం గం గణపతయే వరవరద సర్వజనం మే వశమానయ స్వాహా" అనే మంత్రాన్ని 21 సార్లు జపించాలి. ఈ మంత్రం గణపతి అనుగ్రహాన్ని, సంపదను, వ్యాపారంలో అనుకూలతను పొందడం కోసం ఉద్దేశించింది. అనంతరం గణపతిని అష్టోత్తర శతనామాలతో పూజించాలి.

నైవేద్యం తయారీ

బుధవారం రోజున మహా గణపతికి పెసరపప్పుతో హల్వా తయారు చేసి నైవేద్యంగా సమర్పించాలి. పెసరపప్పు బుధ గ్రహానికి సంబంధించిన ధాన్యం, ఇది గణపతికి ఈ నైవేద్యం ఎంతో ప్రీతిపాత్రమైనది. చివరగా మంగళ హారతి ఇచ్చి నమస్కరించుకోవాలి.

ప్రసాద పంపిణీ

మంత్ర జపం పూర్తయిన తర్వాత, గణపతికి సమర్పించిన ప్రసాదాన్ని అందరికీ పంచి పెట్టాలి. ఈ ప్రసాదం తిన్నవారికి కూడా గణపతి అనుగ్రహం కలుగుతుంది. ఈ విధంగా ప్రసాదం పంచడం వలన వ్యాపార స్థానంలో సానుకూల శక్తులు పెరుగుతాయి.


పూజా ఫలితం

ఈ విధంగా బుధవారం రోజున గణపతిని ఆరాధించి, పెసరపప్పు హల్వా నైవేద్యం సమర్పించి, మంత్ర జపం చేసి, ప్రసాదాన్ని పంపిణీ చేయడం ద్వారా వ్యాపారంలో నష్టాలు తగ్గి, అధిక లాభాలు పెరుగుతాయని ప్రగాఢ విశ్వాసం. వ్యాపారంలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించి, వృద్ధిని, శ్రేయస్సును పొందడం కోసం ఈ పరిహారాన్ని తప్పకుండా పాటించాలని జ్యోతిష్య శాస్త్ర పండితులు చెబుతున్నారు. ఎవరైతే వ్యాపారంలో వృద్ధి లేకుండా నష్టాలతో ఇబ్బంది పడుతున్నారో ఈ

దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట ఠాణా!

- ఫిర్యాదు స్వీకరణ నుంచి ఛార్జిషీట్ తయారీ వరకు ఏఐ సాంకేతికతతోనే పోలీసింగ్ సేవలు
- పైలట్ ప్రాజెక్టుగా ఆధునిక పోలీస్ స్టేషన్ రూపకల్పన.. కొనసాగుతున్న సాంకేతిక పనులను పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్, సీపీ మహేశ్ భగవత్
- ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఏఐ సేవల పనితీరుపై ఆరా.. సిబ్బంది విధుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉన్నతాధికారులు









హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) : దేశ పోలీసింగ్ వ్యవస్థలో సరికొత్త సాంకేతిక విప్లవానికి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ వేదిక కానుంది. దేశంలోనే తొలి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట ఠాణాను తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ తయారీ వరకు పోలీసింగ్ సేవలను ఏఐ సాంకేతికతతో అనుసంధానించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మహేశ్ మురళీధర్ భగవత్ బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో కొనసాగుతున్న సాంకేతిక అభివృద్ధి పనులను పరిశీలించి, ఏఐ ఆధారిత వ్యవస్థల ఏర్పాటుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

➜ ఫిర్యాదుదారులతో ముఖాముఖి

స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఉన్నతాధికారులు నేరుగా మాట్లాడారు. ఏఐ వ్యవస్థ ద్వారా ఫిర్యాదులను ఎలా స్వీకరిస్తున్నారు? బాధితుల సమస్యల పరిష్కారానికి సాంకేతికతను ఏ విధంగా వినియోగిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీశారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, ఏఐ సాంకేతికత ద్వారా అందుతున్న సహకారాన్ని స్వయంగా పరిశీలించారు.ఖైరతాబాద్ జోన్ డీసీపీ, ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌లతో కలిసి స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న సాంకేతిక మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

➜ త్వరలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను పైలట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి త్వరలోనే అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఏఐ సాంకేతికతను పోలీసింగ్‌లో వినియోగించడం ద్వారా సేవలను మరింత వేగవంతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు.ఈ తనిఖీలో అదనపు డీజీపీ అకున్ సభర్వాల్, హైదరాబాద్ అదనపు సీపీ ఎం. శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, టీఎస్‌పార్క్ ఎస్పీ రూపేశ్, డీసీపీ అరవింద్ బాబు తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాను వినియోగించండి.. ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించండి




- మెట్రోలో ప్రయాణించి ప్రజలకు ఆదర్శంగా నిలిచిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్
- ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో రావడంతో రహదారులపై పెరుగుతున్న ఒత్తిడి..
- మెట్రో, ఆర్టీసీ బస్సులను వినియోగించాలని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు పిలుపు

సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రజా రవాణా వ్యవస్థను విస్తృతంగా వినియోగించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పిలుపు నిచ్చారు. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని సూచించారు. ప్రజలకు ఈ సందేశాన్ని ఆచరణలో చూపించేందుకు బుధవారం సీపీ స్వయంగా మెట్రో రైలులో ప్రయాణించారు. రసూల్‌పురా మెట్రో స్టేషన్ నుంచి రాయదుర్గం మెట్రో స్టేషన్ వరకు ప్రయాణించి ప్రజల్లో ప్రజా రవాణాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ట్రాఫిక్-1 జి. హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ జి. నరేందర్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఒక్కొక్కరు ఒక్కో కారులో లేదా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం వల్ల రహదారులపై విపరీతమైన ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సుల వంటి ప్రజా రవాణా సేవలను



వీలైనంత ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు.ప్రజా రవాణా వినియోగం పెరిగితే రహదారులపై వాహనాల సంఖ్య తగ్గి ట్రాఫిక్ రద్దీ నియంత్రణలోకి వస్తుందని, వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించారు. అంతేకాకుండా ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులు ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు.మెట్రో ప్రయాణ సమయంలో తోటి ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన సీపీ.. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, నగర ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడంలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అంతర్జాతీయ వేదిక.. నేటి నుంచి 'సైబరాబాద్ మూవ్స్'



- 'థింక్ ట్రాఫిక్.. టాక్ ట్రాఫిక్' నినాదంతో మూడు రోజుల సదస్సు
- వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి ప్రజా రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో బస్సుల కొరతకు పరిష్కారాల అన్వేషణ.. ఏటా వెయ్యి కొత్త బస్సులు ప్రవేశపెట్టే ప్రణాళిక





సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :సైబరాబాద్‌తో పాటు పశ్చిమ హైదరాబాద్‌ను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పోలీస్, మున్సిపల్, రవాణా శాఖలు సమగ్ర కార్యాచరణకు సిద్ధమయ్యాయి. 'థింక్ ట్రాఫిక్.. టాక్ ట్రాఫిక్', 'మూవ్ పీపుల్.. నాట్ వెహికల్స్' నినాదాలతో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శన 'సైబరాబాద్ మూవ్స్'కు శ్రీకారం చుట్టాయి. నవంబర్ 26 నుంచి ప్రారంభం కానున్న ఈ సదస్సు ద్వారా పట్టణ రవాణా సమస్యలు, ట్రాఫిక్ రద్దీ నివారణ, ప్రజా రవాణా బలోపేతంపై చర్చించనున్నారు.సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన బుధవారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, సైబరాబాద్ పోలీస్, సీఎంసీ, ట్రాఫిక్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం డీజీపీ ప్రారంభించనుండగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అంతర్జాతీయ రవాణా నిపుణులు శశి వర్మ, బొగోటా నగర మేయర్ కూడా ఈ వేదికకు హాజరుకానున్నారు.

➜ వ్యక్తిగత వాహనాలపైనే అధిక ఆధారపడటం

లండన్‌లో 97 శాతం మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారని, అక్కడ 9 వేల బస్సులతో ప్రజా రవాణా వ్యవస్థ సమర్థంగా పనిచేస్తోందని సీపీ వివరించారు. తెలంగాణలో మాత్రం 74 శాతం మంది వ్యక్తిగత ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చి ప్రజా రవాణా వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.
ఐటీ కారిడార్‌కు బస్సుల కొరత ఎప్పుడు తీరేను?
సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో బస్సుల కొరత, చివరి మైలు అనుసంధానం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని సీపీ పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీతో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజా రవాణాను మెరుగుపరిచేందుకు విద్యుత్, ఏసీ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. రానున్న నాలుగైదేళ్ల పాటు ఏటా వెయ్యి కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రణాళిక ఉందన్నారు.

➜ ప్రజల భాగస్వామ్యంతోనే పరిష్కారాలు..

గత నెల రోజుల్లోనే 1,172 వ్యక్తిగత రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని, 174 మంది వాలంటీర్లు, 93 పాఠశాలలు, 27 కళాశాలలు, 113 భాగస్వామ్య సంస్థలు, 62 రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, 21 స్వచ్ఛంద సంస్థలు, టి-హబ్ ద్వారా 28 స్టార్టప్‌లు పాల్గొనేందుకు నమోదు చేసుకున్నాయని సీపీ తెలిపారు. వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోందన్నారు. సదస్సులో ప్యానెల్ చర్చలు, ప్రత్యేక సమావేశాలు, ఐడియాథాన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐడియాథాన్ విజేతలకు ముఖ్యమంత్రి బహుమతులు అందజేయనున్నారు.

➜ ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల అభిప్రాయాలకూ చోటు..

వేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్, పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్ర సవాలుగా మారుతోందని సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ శాఖల ప్రయత్నాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని స్పష్టం చేశారు. సైబరాబాద్ మూవ్స్ కేవలం అధికారులు ప్రసంగించే వేదిక కాదని, నిత్యం రహదారులపై ప్రయాణించే ప్రజలు, నిపుణులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించే బహిరంగ వేదికగా ఉంటుందని తెలిపారు.హైదరాబాద్‌లో భవిష్యత్తులో ఇతర మహానగరాల తరహాలో తీవ్రమైన ట్రాఫిక్ స్తంభన ఏర్పడకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని సీపీ డాక్టర్ ఎం. రమేష్ పిలుపునిచ్చారు. ట్రాఫిక్ సమస్యలపై మీడియా, పౌరులు చురుకుగా చర్చించి పరిష్కారాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, పలువురు జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మేడారంలో దేవాదాయ శాఖకు కేటాయించిన భూములను పరిశీలించిన

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 25(పీపుల్స్ న్యూస్) :శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతర అభివృద్ధి పనుల కోసం దేవాదాయ శాఖకు కేటాయించిన భూములను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు.బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి మేడారంలో దేవాదాయ శాఖకు కేటాయించిన 28 ఎకరాల భూమిని, శాశ్వత ప్రాతిపదికన బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
మేడారంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాల వెనుక వైపున దేవాదాయ శాఖకు కేటాయించిన 28 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా భూముల ప్రస్తుత పరిస్థితి, ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలతో పాటు భవిష్యత్తులో అతిథి గృహం, ఇతర



నిర్మాణాలు చేపట్టేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు స్థలం అనుకూలతను పరిశీలించారు.



ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో కుమారస్వామి, తహసీల్దార్ సురేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి



- గుత్తి కోయ పిల్లలకు బిస్కెట్ల పంపిణీ
- హెడ్ కానిస్టేబుల్ బాలయ్య

ములుగు, జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన గోవిందరావుపేటలో ఏర్పాటు చేస్తున్న మెగా హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు సూచన మేరకు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బాలయ్య కోరారు.వెంకటాపూర్ మండలం బూరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్లతోగు గుత్తి కోయలు నివసిస్తున్న గూడెం బుధవారం బూరుగుపేట విపీఓ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బాలయ్యలు సందర్శించారు.

ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మెగా హెల్త్ క్యాంప్ గోవిందరావుపేట్ మండల్ పి ఎస్ ఆర్ గార్డెన్ లో ఉన్నందున అక్కడికి చేరుకుని గుత్తి కోయల కుటుంబాలను, పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

11 ఏళ్లు.. 4గురు పెద్దమనుషులు.. అయినా పూర్తి కాని ఎల్లమ్మ గుడి!







వెంకటాపూర్ నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) : లక్ష్మీదేవిపేటలో ఎల్లమ్మ తల్లి గుడి కథ 11 ఏళ్లుగా ఒకే చోట ఆగిపోయింది. 2015లో మొదలైన నిర్మాణం 2026 వచ్చినా ఇంకా పూర్తి కాలేదు.

ప్రభుత్వాలు మారాయి.. ఎమ్మెల్యేలు మారారు.. మారనిది గుడే!

వెంకటాపూర్ మండలంలోని మేజర్ పంచాయతీ లక్ష్మీదేవిపేటలో గీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒక పెద్దమనిషి చొప్పున ఐదుగురు మారిపోయారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారాయి, ఎమ్మెల్యేలు మారారు.మంత్రులు అయినా కానీ గుడి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

అడిగితే బుజ్జగింపులే..!

గ్రామస్తులు, కులస్తులు అడిగితే చాలు బుజ్జగింపులతో దాటవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని కాగితాలు మారినా, ఎన్ని దరఖాస్తులు పెట్టినా నిధులు మాత్రం రావడం లేదు.

అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకే పెద్దమనుషులు!

ఏ పార్టీ అధికారంలో ఉంటే గుడి నిర్మాణం పేరుతో ఆ పార్టీకి పెద్దమనుషులు మారిపోతున్నారన్నది గ్రామంలో పెద్ద చర్చగా మారింది. గుడి చుట్టూ పెత్తనం కోసం చిల్లర రాజకీయాలు తప్ప నిర్మాణంపై శ్రద్ధ లేదని భక్తులు మండిపడుతున్నారు.

బోర్డు తుప్పు పట్టింది.. గుడి అలాగే ఉంది!

గుడి కోసం పెట్టిన బోర్డు తుప్పు పట్టిపోతున్నా పట్టించుకునే వారే లేరు. కుల సంఘం ఎన్నిక వస్తే చాలు పెత్తనం కోసం రెండు రోజులు చక్రం తిప్పుతారే తప్ప, గుడి పూర్తి చేయాలనే ఆలోచన ఎవరికీ లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గుడి పేరుతో లక్షలు ఖర్చు.. ఫలితం శూన్యం!

గుడి పేరుతో ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చయ్యాయని, అయినా ఫలితం మాత్రం శూన్యమని గ్రామస్తులు చెబుతున్నారు. గుడిని చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. ఎప్పుడు పూజలు మొదలవుతాయోనని భక్తులు ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికైనా రాజకీయాలు పక్కనపెట్టి, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించి ఎల్లమ్మ తల్లి గుడిని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు, కులస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కన్నీటిని తుడిచిన స్నేహహస్తం!



- మిత్రుడు మరణించిన.. మిత్రధర్మం మరువని 2000-01 ఎస్ఎస్సీ బ్యాచ్

మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :ఆ పాఠశాల గోడలు ఇప్పటికీ వారి నవ్వులను గుర్తుచేసుకుంటున్నాయి. ఒకే బెంచీ..ఒకే పుస్తకం..ఒకే ఆట..25 ఏళ్ల క్రితం ఆకినపెల్లి జెడ్ పి ఎస్ ఎస్ లో మొదలైన ఆ స్నేహం..ఇప్పటికీ చెక్కుచెదరలేదని నిరూపించారు. తమతో పాటు చదువుకున్న ప్రియ మిత్రుడు దూడపాక రమేష్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడన్న వార్త వారి గుండెలను ముక్కలు చేసింది. వాడు లేని లోటు తీర్చలేని దని తెలిసిన, వాడి కుటుంబం రోడ్డున పడకూడదని 2000-2001 ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రులంతా ఒక్కటయ్యారు. చిటికెలో రూ.25,000 సమకూర్చి, కన్నీటి పర్యంతమవుతున్న ఆ కుటుంబానికి అండగా నిలిచారు. “రమేష్ లేడు..కానీ వాడి జ్ఞాపకాలు, వాడి కుటుంబం మాకు ఉన్నాయి” అంటూ వారు చూపిన మానవత్వం చూసి గ్రామం మొత్తం కన్నీటి పర్యంతమైంది. స్నేహానికి నేటికీ చావు లేదని నిరూపించిన అక్షర మిత్రులు..డబ్బు ఉంటేనే పలకరించే కాలంలో, స్నేహం అంటే ఫేస్‌బుక్ లైకులే అనుకునే రోజుల్లో..అసలైన స్నేహం అంటే ఏంటో చూపించారు ఆకినపెల్లి విద్యార్థులు..2000-01లో జడ్పీహెచ్ఎస్ లో చదువుకున్న ఆ బ్యాచ్ కు ఒక విషాద వార్త..తమ మిత్రుడు దూడపాక రమేష్ అనారోగ్యంతో శాశ్వతంగా దూరమయ్యాడు. ఆ బాధలో కూడా వారు రమేష్ కుటుంబాన్ని మర్చిపోలేదు..శోకంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు, భార్య, బిడ్డలకు ధైర్యం కావాలని..వెంటనే స్పందించి రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. ఇది కేవలం డబ్బు కాదు..25 ఏళ్ల స్నేహానికి, మానవ త్వానికి నిలువెత్తు నిదర్శనం. ఈ స్నేహబంధం నేటి యువతకు ఆదర్శం. ఆకినపెల్లి జడ్పీహెచ్ఎస్ 2000-01 బ్యాచ్ విద్యార్థుల మానవత్వం. ఇటీవల మృతి చెందిన మిత్రుడు దూడపాక రమేష్ కుటుంబానికి రూ. 25 వేల అండ. “మా రమేష్ లేకపోయిన, వాడి కుటుంబానికి మేమున్నాం” అంటూ కంటతడి పెట్టిన మిత్రులు.

సంవిధాన్ రక్షా మార్చ్ కు వెంకటాపూర్ నుండి భారీగా తరలిరండి..!



- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ పిలుపు..

వెంకటాపూర్, నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏఐసీసీ పిలుపు మేరకు నవంబర్ 26న (గురువారం) నిర్వహించే సంవిధాన్ రక్షా మార్చ్ – రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ కి వెంకటాపూర్ మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొనాలని వెంకటాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్ లో భారీ ప్రదర్శన..

26న ఉదయం 10.30 గంటలకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం (లిబర్టీ) నుంచి నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరగనుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ ఇంచార్జ్ బి.ఎం. సందీప్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి & స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరుకానున్నారు. ఉదయం6 గంటలకు ములుగు లోని గట్టమ్మతల్లి ఆలయం నుండి ర్యాలీగా బయలుదేరడం జరుగుతుందని, నాయకులు గమనించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బండి శ్రీనివాస్ కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన టీఎస్‌జేయూ నేతలు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్‌జేయూ) నాయకులు కొల్లోజు దిలీప్ కుమార్ -- రచిత నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలో నిర్వహించిన వారి వివాహ వేడుకకు టీఎస్‌జేయూ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న దంపతులు పరస్పర అన్యోన్యత, ప్రేమానురాగాలతో కలకాలం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వారి వైవాహిక జీవితం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా సంయుక్త కార్యదర్శి కడపాక రవి, జిల్లా సహాయ కార్యదర్శి క్యాతం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా నాయకులు అడ్డగట్ల శ్రీనివాస్, ఇమ్రాన్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల ఆధార్ వివరాల నమోదు, అప్‌డేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదు: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



- పెద్దగొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన పీఓ.. విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక పర్యవేక్షణ

ఏటూరునాగారం, ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్యార్థుల వివరాల నమోదు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం పెద్దగొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన పీఓ, విద్యార్థుల ఆధార్ వివరాల నమోదు, అప్‌డేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేర్ల స్పెల్లింగ్, ఫొటోలు, ఇతర వ్యక్తిగత వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా వివరాల్లో వ్యత్యాసాలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే సరిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ఆధార్ వివరాలు ఖచ్చితత్వంతో నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం పాఠశాల ప్రాంగణంలోని విద్యార్థుల భోజనశాలను సందర్శించి, విద్యార్థులకు భోజనం అందిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం, పాఠశాలలోని సౌకర్యాలు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు.

గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందాలంటే ఆధార్, బ్యాంకు ఖాతాలు వంటి కీలక వివరాలు ఖచ్చితంగా ఉండటం అవసరమని పీఓ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలను కేవలం ఆన్‌లైన్ నమోదు వరకే పరిమితం చేయకుండా, ప్రతి విద్యార్థి వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, పెండింగ్ అంశాలను గుర్తించి పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా గిరిజన సంక్షేమ విద్యాసంస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని పీఓ స్పష్టం చేశారు.

వెంకటాపూర్ మండలంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పర్యటన



- మృతుల కుటుంబాలకు పరామర్శ

వెంకటాపూర్ నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్): వెంకటాపూర్ మండలంలో బుధవారం బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి తల్లి భాగ్యమ్మ ఇటీవల మృతి చెందారు. అదేవిధంగా మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామానికి చెందిన రామప్ప ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ తండ రమేష్ తల్లి సైతం ఇటీవల మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న ఆయన మండలంలో పర్యటించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా,మండల, గ్రామస్థాయి నాయకులు ఉన్నారు.



రామప్ప రాళ్లకు రక్షణ కరువా?



- కాపాడాల్సిన శాఖ వ్యక్తి ఇంటి ముందే కాకతీయుల చారిత్రక సంపద!

వెంకటాపూర్ నవంబర్ 25 (పీపుల్స్ న్యూస్) :చరిత్రను మోసే ప్రతి రాయి ఒక గత సామ్రాజ్యానికి సాక్ష్యం. శిల్పకళా వైభవానికి,తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన రామప్ప ఆలయం ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు సంపాదించుకుంది. అలాంటి ఆలయానికి చెందిన రాతి బండలు ఇప్పుడు ఆలయంలో కాకుండా, పురావస్తు శాఖకు చెందిన ఓ వ్యక్తి ఇంటి ముందు కనిపించడం కలకలం రేపుతోంది.

ఇది నిన్న మొన్న జరిగిన వ్యవహారం కాదు. ఏడాదికి పైగా ఆ బండలు అక్కడే పడి ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న రాళ్లు వ్యక్తిగత నివాసం ముందుకు ఎలా చేరాయి? ఎవరు తీసుకొచ్చారు? ఎవరి అనుమతితో అక్కడ ఉంచారు? సంరక్షించాల్సిన శాఖలోనే ఇలా జరిగితే, ఇక సంపదకు భద్రత ఎక్కడ?

గర్భగుడిలో దేవుడు.. గడప ముందు చరిత్ర!

రామప్పను చూడటానికి వచ్చే ప్రతి భక్తుడు, పర్యాటకుడు అక్కడి శిల్పాలను చూసి ముగ్ధుడవుతాడు.కానీ అదే ఆలయానికి చెందిన రాళ్లు ఒకరి ఇంటి ముందు నడకదారిలా పరచి ఉండటం చూస్తే ఎవరికైనా ఆవేదన కలుగుతుంది.ఇవి మామూలు రాళ్లు కావు. కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లు. వాటిని భద్రపరిచి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే. కానీ ఇక్కడ జరుగుతున్నది దానికి పూర్తి భిన్నం. వ్యక్తిగత అవసరం కోసం చారిత్రక సంపదను వాడుకునే హక్కు ఎవరికీ లేదు.

కాపాడాల్సిన వారిపైనే అనుమానాలు..

సాధారణ వ్యక్తి ఇంటి ముందు ఈ రాళ్లు ఉంటే వేరే విషయం. కానీ కట్టడాలను కాపాడాల్సిన శాఖ వ్యక్తి ఇంటి ముందే అవి ఉండటంతో ఈ వ్యవహారం మరింత తీవ్రంగా మారింది. ఆలయంలో ఏది చారిత్రక భాగమో,ఏది సంరక్షించాల్సిన వస్తువో ఆ శాఖ వారికి బాగా తెలుసు. అలాంటప్పుడు ఏడాది పాటు అవి అక్కడే ఉండటాన్ని ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోలేదు? ఇది ఎవరిపైనా నేరుగా నింద మోపడం కాదు. కానీ ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

తేలాల్సిన ప్రశ్నలు ఇవే..

ఆ బండలు ఆలయంలో ఏ భాగానికి చెందినవి?
వాటిని ఎప్పుడు, ఎవరి ఆదేశంతో తరలించారు?తరలింపునకు అధికారిక అనుమతి ఉందా?ఇంటి ముందు ఎందుకు పరిచారు?
ఏ ఎస్ ఐ రికార్డుల్లో దీని గురించి ఏమైనా ఉందా?ఏడాది పాటు అక్కడే ఉన్నా అధికారులు ఎందుకు స్పందించలేదు?

సమగ్ర విచారణ జరగాలి..

ఈ వ్యవహారంపై ఏఎస్ఐ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. ఆ రాళ్ల మూలాన్ని నిర్ధారించి, తరలింపునకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలి. అవసరమైతే నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలి.అనుమతి లేకుండా తరలించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.ఆ బండలను తిరిగి భద్రమైన చోటికి తరలించాలి.ఒకవేళ అందులో ఎలాంటి తప్పు లేదని భావిస్తే, అందుకు సంబంధించిన అనుమతి పత్రాలను ప్రజల ముందు ఉంచాలి.ప్రపంచ వారసత్వ సంపదకు కాపలాగా ఉండాల్సిన వారే ఇలా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి రావడం బాధాకరమని భక్తులు, మండల ప్రజలు అంటున్నారు.

ఐసీసీ నంబర్ వన్ ర్యాంక్‌పై బుమ్రా గురి!

● టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకిన భారత పేసర్.. అగ్రస్థానానికి చేరువలో



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానాన్ని అందుకునేందుకు చేరువయ్యాడు. తాజాగా విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఉమ్మడి రెండో స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు పడగొట్టడం అతడికి కలిసొచ్చింది.ప్రస్తుతం ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 881 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, బుమ్రా 856 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ బౌలర్ ఓలీ రాబిన్సన్ కూడా అదే పాయింట్లతో ఉమ్మడి రెండో స్థానాన్ని పంచుకుంటున్నాడు. స్టార్క్‌కు బుమ్రాకు మధ్య కేవలం 25 పాయింట్ల తేడా మాత్రమే ఉండటంతో తదుపరి మ్యాచ్‌ల్లో బుమ్రా ప్రదర్శన కీలకం కానుంది.మరోవైపు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లోనూ భారత ఆటగాళ్లు సత్తా చాటారు. రిషబ్ పంత్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంక్‌కు చేరుకోగా, శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు ఎగబాకి ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు. యశస్వి జైస్వాల్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. దీంతో టెస్టు బ్యాటింగ్ టాప్-10లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు సంపాదించారు.

యువరాజ్ అరగంట ఫోన్ కాల్.. వైభవ్ సూర్యవంశీ విధ్వంసానికి బాటలు!

సలహాలు పాటించి సరికొత్త చరిత్ర సృష్టించిన 15 ఏళ్ల సంచలనం.. 53 బంతుల్లో 204 పరుగులతో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరిచిన యువ ఆటగాడు



దోహా: భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్ సత్తా చాటాడు. యూఏఈతో జరిగిన ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. మైదానంలోకి దిగినప్పటి నుంచి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారించాడు. అయితే ఈ అద్భుత ఇన్నింగ్స్ వెనుక భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఇచ్చిన విలువైన సలహాలు కీలక పాత్ర పోషించాయి. మ్యాచ్‌కు ముందు యువరాజ్‌తో సుమారు 30 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడిన వైభవ్.. ఆయన సూచనలను పాటించి తన ఆటతీరులో మార్పు చేసుకున్నాడు. ఆ సలహాలే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని వెల్లడించాడు.ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోవడంతో వైభవ్ కొంత ఒత్తిడికి గురయ్యాడు. బ్యాటింగ్‌లో తాను చేస్తున్న తప్పులను గుర్తించేందుకు ప్రయత్నించాడు. ముఖ్యంగా క్రీజులోకి వచ్చిన వెంటనే భారీ షాట్లకు ప్రయత్నించడం వల్ల వికెట్ కోల్పోతున్నానని గుర్తించాడు. ఈ సమస్యను అధిగమించేందుకు తన తండ్రి, చిన్ననాటి కోచ్ మనీష్ ఓజా, అండర్-19 సహచరుడు ప్రథమ్ జాచక్‌తో చర్చించాడు. ఈ క్రమంలో తన అభిమాన క్రికెటర్ యువరాజ్ సింగ్‌ను కూడా సంప్రదించాడు. సుమారు అరగంట పాటు సాగిన ఫోన్ సంభాషణలో తన బ్యాటింగ్ సమస్యలను వివరించాడు. యువరాజ్ కూడా వైభవ్ ఆటతీరును విశ్లేషించి పలు కీలక సూచనలు చేశాడు.**20 బంతులు ఆడితే ఆటతీరే మారుతుంది!** క్రీజులోకి వచ్చిన వెంటనే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించకుండా మొదట పరిస్థితులను అర్థం చేసుకోవాలని యువరాజ్ సూచించాడు. తొలి 20 బంతులు ఆత్మవిశ్వాసంతో ఆడాలని, ఆ తర్వాత సహజమైన ఆటను కొనసాగించాలని సలహా ఇచ్చాడు. ప్రారంభంలో ప్రతి బంతినీ బౌండరీకి తరలించాలనే ఆలోచన వద్దని, బంతి స్వభావం, పిచ్ పరిస్థితులను గమనిస్తూ ఆడాలని వివరించాడు. తొలి 20 బంతులు ఆడగలిగితే ఆ తర్వాత బ్యాటింగ్ మరింత సులభమవుతుందని చెప్పాడు. ఈ సూచనలు వైభవ్‌పై ప్రభావం చూపాయి. తన బ్యాటింగ్ వీడియోలను పరిశీలించి తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేశాడు. యువరాజ్ చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టాలని నిర్ణయించుకున్నాడు. **53 బంతుల్లో 204 పరుగుల విధ్వంసం** యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ తన బ్యాటింగ్ ప్రతాపాన్ని చూపించాడు. ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసంతో ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కేవలం 28 బంతుల్లోనే శతకం పూర్తి చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం మరింత దూకుడు పెంచి 40 బంతుల్లో 150 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. కేవలం 52 బంతుల్లోనే ద్విశతకం సాధించి మరో అరుదైన ఘనతను అందుకున్నాడు. మొత్తం 53 బంతుల్లో 28 సిక్సర్లు, ఏడు ఫోర్లతో 204 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో సిక్సర్ల సంఖ్యే 28 కావడం అతడి విధ్వంసకర బ్యాటింగ్‌కు నిదర్శనం. ప్రత్యర్థి బౌలర్లు ఎలాంటి వ్యూహం అమలు చేసినా వైభవ్ దూకుడును అడ్డుకోలేకపోయారు.ఈ ఇన్నింగ్స్‌తో లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం, ద్విశతకం సాధించిన ఆటగాడిగా వైభవ్ రికార్డులు సృష్టించాడు. తన అసాధారణ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాడు. చిన్న వయసులోనే ఇంతటి భారీ ఇన్నింగ్స్ ఆడటం అతడి ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి, తన సహజమైన ఆటతీరును ప్రదర్శించడం విశేషం. **భారత్-ఎ జట్టుకు ఘన విజయం** వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా భారత్-ఎ జట్టు భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. యూఏఈ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.2 ఓవర్లలోనే అందుకుంది. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. వైభవ్ 204 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే సమయానికి భారత్ విజయానికి కేవలం ఐదు పరుగులే అవసరమయ్యాయి. అనంతరం రింకూ సింగ్ సిక్సర్‌తో విజయాన్ని ఖరారు చేశాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ ప్రదర్శన టోర్నీలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. **గురువు మాట.. ఆటగాడికి కొండంత బలం** యువరాజ్ సింగ్ భారత క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఒత్తిడిని అధిగమించి మ్యాచ్‌లను మలుపుతిప్పిన అనుభవం ఆయనకు ఉంది. యువ ఆటగాళ్లకు తన అనుభవాన్ని పంచుతూ వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నిస్తుంటాడు. వైభవ్ విషయంలోనూ అదే జరిగింది. ఒక యువ ఆటగాడు తన సమస్యను గుర్తించి, అనుభవజ్ఞుడైన క్రికెటర్ సలహా తీసుకుని, దానిని మైదానంలో అమలు చేస్తే ఎలాంటి ఫలితం సాధించవచ్చో ఈ ఇన్నింగ్స్ చాటిచెప్పింది.మ్యాచ్ అనంతరం వైభవ్ మాట్లాడుతూ.. యువరాజ్ సింగ్ తన అభిమాన ఆటగాడని, ఆయన ఇచ్చిన సలహాలను శ్రద్ధగా విన్నానని తెలిపాడు. బ్యాటింగ్‌లో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు యువరాజ్ సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని తన సహజమైన ఆటను కొనసాగించానని వివరించాడు. కేవలం ప్రతిభ ఉంటేనే సరిపోదని, సరైన సమయంలో సరైన సలహాలు కూడా ఆటగాడి ప్రదర్శనను మెరుగుపరుస్తాయని వైభవ్ ఇన్నింగ్స్ నిరూపించింది.**భవిష్యత్తుపై భారీ అంచనాలు** వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే తన అసాధారణ బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. చిన్న వయసులోనే భారీ షాట్లు ఆడగల సామర్థ్యం, వేగంగా పరుగులు సాధించే నైపుణ్యం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతున్నాయి. అయితే ఈ విజయాలతోనే సంతృప్తి చెందకుండా నిలకడైన ప్రదర్శన కొనసాగించడం అతడికి అత్యంత ముఖ్యం. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం, క్రమశిక్షణ కూడా అవసరం.మొత్తంగా యువరాజ్ సింగ్‌తో జరిగిన అరగంట సంభాషణ వైభవ్ ఆటతీరులో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనే విషయం అతడి ప్రదర్శనతో స్పష్టమైంది. ఒకవైపు అనుభవజ్ఞుడైన ఆటగాడి మార్గదర్శకత్వం, మరోవైపు యువ ఆటగాడి పట్టుదల కలిస్తే ఎలాంటి అద్భుతాలు సాధ్యమవుతాయో ఈ మ్యాచ్ తెలియజేసింది. 53 బంతుల్లో 204 పరుగుల ఇన్నింగ్స్‌తో వైభవ్ సూర్యవంశీ తన పేరును రికార్డుల పుటల్లో లిఖించుకున్నాడు. రానున్న రోజుల్లో భారత క్రికెట్‌లో మరిన్ని సంచలనాలు సృష్టిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.



కమిన్స్ మాటలు నన్ను బాధించాయి

● వ్యక్తిగతంగా విమర్శిస్తాడని ఊహించలేదు.. అతనిపై ఇప్పటికీ అభిమానం ఉంది: ఉస్మాన్ ఖవాజా

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియా క్రికెట్‌లో 2018లో చోటుచేసుకున్న బాల్ ట్యాంపరింగ్ (శాండ్‌పేపర్) వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై తన ఆత్మకథ లిస్‌బ్రిల్‌లో జట్టులోని సభ్యులందరికీ ముందే తెలుసని పేర్కొన్న మాజీ ఆటగాడు ఉస్మాన్ ఖవాజా.. తాజాగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాడు.కమిన్స్ నిర్వహించిన సుదీర్ఘ ప్రెస్‌మీట్‌లో తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం తీవ్రంగా బాధించిందని ఖవాజా తెలిపాడు. "ప్యాట్ కమిన్స్‌ను వ్యక్తిగతంగా, నాయకుడిగా ఎంతో ఇష్టపడతాను. కానీ అతను నాపై ఈ విధంగా బహిరంగంగా వ్యక్తిగత దాడికి దిగుతాడని ఊహించలేదు. గతంలో అతనిలో ఇలాంటి కోణాన్ని చూడలేదు. అందుకే తీవ్ర నిరాశకు గురయ్యాను" అని చెప్పాడు.ప్రెస్‌మీట్ చూస్తున్న సమయంలో తన భార్య రేచల్ పక్కనే ఉండి పదేపదే క్షేమం అడిగిందని, ఆ సమయంలో భావోద్వేగానికి గురై సమాధానం కూడా చెప్పలేకపోయానని వెల్లడించాడు.ఈ వివాదంలో తన సమస్య కమిన్స్‌తో కాదని, క్రికెట్ ఆస్ట్రేలియా వ్యవహరించిన తీరుతోనేనని ఖవాజా స్పష్టం చేశాడు. జట్టులో నెలకొన్న 'ఎలాగైనా గెలవాలి' అనే ధోరణికి క్రికెట్ ఆస్ట్రేలియా బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డాడు. ఈ వ్యవహారంలో సంస్థే ముందుకొచ్చి నాయకత్వం వహించాల్సిందన్నాడు.కమిన్స్‌పై తనకు ద్వేషం లేదని, ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యల ఆధారంగా అతడిపై శాశ్వత అభిప్రాయం ఏర్పరుచుకోనని తెలిపాడు. "ఆ మాటలు నన్ను బాధించినా.. ప్యాట్‌పై నాకు ఎప్పటికీ అభిమానం ఉంటుంది" అని ఖవాజా పేర్కొన్నాడు.

వన్డేల్లో వైభవ్ ట్రిపుల్ సెంచరీ ఖాయం!

- రికార్డులు బద్దలు కొట్టాలంటే క్రిస్ గేల్ మళ్లీ రావాల్సిందే.. చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా ధీమా



ఇంటర్నెట్ డెస్క్: భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై అతడి చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా ప్రశంసలు కురిపించాడు. భవిష్యత్తులో వైభవ్ వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ సాధించే సత్తా ఉందని ధీమా వ్యక్తం చేశాడు. ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈపై కేవలం 53 బంతుల్లో 204 పరుగులు చేసి వైభవ్ ప్రపంచ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.రెండేళ్ల క్రితమే వైభవ్ డబుల్ సెంచరీ సాధిస్తాడని తాను అంచనా వేసినట్లు ఓజా తెలిపాడు. అతడి ప్రస్తుత ఆటతీరును చూస్తుంటే 300 పరుగులు చేయడం కూడా అసాధ్యమేమీ కాదన్నాడు. యూఏఈపై ఆడిన ఇన్నింగ్స్ దూకుడు, వినోదం, అద్భుతమైన బ్యాటింగ్‌తో కూడిన అసాధారణ ప్రదర్శనగా అభివర్ణించాడు. 14-15 ఓవర్లలోనే 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే సత్తా ఉన్న వైభవ్.. ఇదే దూకుడుతో 50 ఓవర్లు ఆడితే భారీ స్కోరు సాధించగలడని పేర్కొన్నాడు.ప్రస్తుతం వైభవ్ నెలకొల్పుతున్న రికార్డులను బద్దలు కొట్టే ఆటగాడు కనిపించడం లేదని, వాటిని అధిగమించాలంటే వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ మళ్లీ మైదానంలోకి రావాల్సిందేనని సరదాగా వ్యాఖ్యానించాడు.

ఐపీఎల్ వేలంలోకి సెహ్వాగ్ తనయుడు!

● రూ.30 లక్షల కనీస ధరతో ఆర్యవీర్ పేరు నమోదు.. అండర్-19 ఆసియా కప్‌లో 361 పరుగులతో సత్తా



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ ఐపీఎల్-2027 మినీ వేలంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఈ మేరకు వేలం కోసం తన పేరును నమోదు చేసుకున్నాడు. రూ.30 లక్షల కనీస ధరతో వేలం బరిలోకి దిగుతున్నాడు. ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆర్యవీర్.. ఇప్పుడు ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమయ్యాడు.తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ మాదిరిగానే ఆర్యవీర్ కూడా కుడిచేతి వాటం ఓపెనింగ్ బ్యాటర్. ఇటీవల ఒమన్ వేదికగా జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో భారత జట్టు తరఫున నిలకడగా రాణించాడు. ఐదు మ్యాచ్‌ల్లో 361 పరుగులు సాధించి టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. 90.25 సగటు, 95.50 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఒక సెంచరీతో పాటు మూడు అర్ధసెంచరీలు సాధించి తన ప్రతిభను చాటాడు.ఈ టోర్నీలో ఆర్యవీర్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 168 బంతుల్లో 160 పరుగులు చేసి తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌పై 51 పరుగులు చేయగా, పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో 58 పరుగులతో రాణించాడు. కీలకమైన ఫైనల్లో కెప్టెన్ లక్ష్య రైచందానితో కలిసి తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివరి బంతికి పాకిస్థాన్‌ను ఓడించి భారత్ అండర్-19 ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.ఆర్యవీర్‌తో పాటు మరో యువ ఆటగాడు మోహిత్ ఉల్వా కూడా ఐపీఎల్ వేలానికి పేరును నమోదు చేసుకున్నాడు.

మళ్లీ యాక్షన్ హీరోగా శరత్‌కుమార్.. 177వ చిత్రానికి 'టాక్సీ' టైటిల్



సీనియర్ నటుడు, రాజకీయ నాయకుడు శరత్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న 177వ చిత్రానికి 'టాక్సీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం చెన్నైలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. సుదీర్ఘ విరామం తర్వాత శరత్‌కుమార్ ఈ చిత్రంలో పూర్తిస్థాయి యాక్షన్ రోల్‌లో కనిపించనున్నాడు.పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి ధన దర్శకత్వం వహిస్తున్నాడు. గతంలో శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో ఆయన తెరకెక్కించిన 'వానం కొట్టటుం' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బెర్జయ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, రాడాన్ మీడియా వర్క్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.ఈ సినిమా ప్రారంభోత్సవానికి దిగ్గజ దర్శకుడు మణిరత్నం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన దర్శకుడు ధనను అభినందిస్తూ, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశాడు. గతంలో ధన.. మణిరత్నం వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు.ఈ చిత్రానికి ప్రముఖ రచయిత బి. జయమోహన్ కథను అందిస్తుండగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూరుస్తున్నాడు. నవీన్ కుమార్ ఛాయాగ్రహణ బాధ్యతలు చేపట్టగా, సిల్వా మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీని పర్యవేక్షిస్తున్నాడు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

గర్వంగా ఉంది..

మిస్ యూనివర్స్ 2026కజియా లిజ్ మేజోపై సుస్మితా సేన్ ప్రశంసల జల్లు





75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన మిస్ యూనివర్స్ ఇండియా 2026 కజియా లిజ్ మేజోపై బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ ప్రశంసల వర్షం కురిపించారు. అంతర్జాతీయ వేదికపై కజియా ప్రదర్శన ఎంతో గర్వకారణంగా ఉందని ఆమె పేర్కొన్నారు.
ప్యూర్టో రికోలోని శాన్ జువాన్ నగరంలో గల జోస్ మిగ్యుల్ అగ్రెలట్ కొలీసియంలో 75వ మిస్ యూనివర్స్ గ్రాండ్ ఫినాలే ఘనంగా జరిగింది. ఈ పోటీల్లో కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని కజియా లిజ్ మేజో భారత్ తరఫున బరిలోకి దిగారు. మొత్తం 116 దేశాల సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీల్లో ఆమె టాప్ 30 సెమీఫైనలిస్టులలో ఒకరిగా నిలిచారు. అయితే, తదుపరి రౌండైన టాప్ 12లోకి ఆమె ప్రవేశించలేకపోయారు. కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న తొలి యువతిగా కజియా రికార్డు సృష్టించారు.
ఈ పోటీల అనంతరం సుస్మితా సేన్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కజియా ఫొటోను షేర్ చేస్తూ భావోద్వేగ సందేశాన్ని రాసుకొచ్చారు. "నువ్వు కేవలం పాల్గొనడమే కాదు, ప్రతి క్షణాన్ని నీ సొంతం చేసుకున్నావు. ఎంతో హుందాతనం, తెలివితేటలు, ధైర్యంతో కూడిన హృదయంతో పోటీపడ్డావు. నువ్వు అందరి మనసులను గెలుచుకున్నావు. భారతదేశానికి ఇంతటి అద్భుతమైన ప్రాతినిధ్యం వహించినందుకు నిన్ను చూసి ఎంతో గర్వపడుతున్నాను. ఇలాగే మెరుస్తూ ఉండు, నువ్వు దీని కోసమే పుట్టావు" అని సుస్మిత కొనియాడారు.
1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని సుస్మితా సేన్ కైవసం చేసుకున్నారు. కాగా, ఈ 75వ మిస్ యూనివర్స్ టైటిల్‌ను ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో గెలుచుకున్నారు.

సంబరాల బాబు సౌండ్ గట్టిగానే చేయాలి!



సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తోన్న భారీ యాక్షన్ చిత్రం -సంబరాల ఏటిగట్టు-పై అభిమానుల్లో ఎన్నో అంచనాలున్నాయి. నిజానికి ఈ సినిమా ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ వివిధ కారణాల వల్ల విడుదల వాయిదా పడుతోంది. సంక్రాంతి కానుకగా జనవరి 12న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత సాయి తేజ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో సంక్రాంతి రేసులో బాక్సాఫీస్ వద్ద గట్టిగానే సౌండ్ చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అయితే సంక్రాంతి బరిలో నిలవడం అంటే సులువైన విషయం కాదు. జనవరి 12న విడుదల అంటున్నా? అదే సమయంలో మరికొన్ని క్రేజీ సినిమాలు కూడా పోటీలో ఉన్నాయి. మేనమామ మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న -కాకా- చిత్రం కూడా సంక్రాంతి సీజన్‌లోనే రిలీజ్ అవుతుంది. ఒకవైపు మెగాస్టార్ లాంటి దిగ్గజ హీరో సినిమా- మరోవైపు ఇతర అగ్ర హీరోల చిత్రాల నడుమ -సంబరాల ఏటిగట్టు- ఉనికిని చాటుకోవాలంటే ప్రమోషన్ల విషయంలో పెద్ద కసరత్తు చేయాల్సిందే.ఇంత తీవ్రమైన పోటీని తట్టుకుని ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలంటే ప్రచార హోరు తారెత్తిపోయేలా ఉండాలి. కానీ విడుదల తేదీ దగ్గరపడుతున్నా? ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి ఆ స్థాయి హడావుడి ఇంకా మొదలు కాలేదు. టీజర్లు.. పాటలు.. వరుస అప్‌డేట్లతో సోషల్ మీడియాలో వాతావరణాన్ని వేడెక్కించాల్సిన సమయం ఆసన్నమైంది. సాయి తేజ్ కెరీర్ పరంగా చూస్తే -బ్రో- తర్వాత ఆయన నుంచి మరో సినిమా వచ్చి చాలా కాలమైంది. సుదీర్ఘ విరామం తర్వాత వస్తున్న -సంబరాల ఏటిగట్టు-లో సరికొత్త మేకోవర్‌తో.. రస్టిక్ యాక్షన్ అవతార్‌లో కనిపించ బోతున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ చిత్రం కథాబలం.. విజువల్స్‌పై మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నా? ఆ విషయాన్ని ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లడం ఇప్పుడు అత్యంత కీలకమైంది. సంక్రాంతి సీజన్‌లో ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకుల ఆదరణ దక్కాలంటే కంటెంట్ బాగుంటే సరిపోదు. పక్కా ప్లానింగ్‌తో కూడిన పబ్లిసిటీ కూడా అంతే అవసరం. ఇంటర్వ్యూలు, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, వినూత్న ప్రచార కార్యక్రమాలతో సాయి తేజ్ స్వయంగా రంగంలోకి దిగి సినిమాపై హైప్ పెంచాల్సి ఉంది. సంక్రాంతి పోటీలో నిలబడి విజయం సాధించాలంటే సంబరాల బాబు ప్రచార వేగాన్ని తక్షణమే పెంచాలి. మరి ఈ విషయంలో టీమ్ ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్తుందో చూడాలి

ఆషిఖీ రేంజు మ్యూజికల్ లవ్ స్టోరీలో దురంధర్ బ్యూటీ

ధురంధర్- ఫేమ్ సారా అర్జున్ తొలిసారి ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను దక్కించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో కథనాలు వినిపిస్తున్నాయి. కెరీర్ ఆరంభమే ఒక భారీ స్పై థ్రిల్లర్ కథాంశంలో నటించి మెప్పించిన సారా, ఈసారి తన వయసుకు తగ్గట్టు ఒక అద్భుతమైన మ్యూజికల్ లవ్ స్టోరీలో నటించబోతోంది. ఇది ఆషిఖీ రేంజులో ఉంటుందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. టైగర్ 3 (2023) చిత్రానికి దర్శకత్వం వహించిన మనీష్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా.. 2027 జనవరిలో పంజాబ్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో -సప్నే వర్సెస్ ఎవ్రీవన్- ఫేమ్ నటుడు అంబ్రీష్ వర్మ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. కథాంశంలో సంగీతానికి అత్యంత ప్రాధాన్యత ఉండేలా మొత్తం ఎనిమిది పాటలతో ఈ మ్యూజికల్ రొమాన్స్ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఇతర పాత్రధారుల వివరాలతో పాటు వైఆర్ఎఫ్ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో బ్యాండ్ బాజా బారాత్ (2010), శుద్ధ్ దేసీ రొమాన్స్ వంటి రొమాంటిక్ చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మనీష్ శర్మ.. చాలా కాలం తర్వాత మళ్లీ రొమాన్స్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్‌లతో -టైగర్ 3- వంటి యాక్షన్ సినిమా చేసిన తర్వాత ఇప్పుడు అంతా యూత్‌తో మ్యూజికల్ ప్రేమకథను ఎంచుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. సారా అర్జున్‌కు ఇది వైఆర్ఎఫ్ సంస్థలో తొలి సినిమా కావడంతో, తన కెరీర్‌లో ఇది మరో కీలక మలుపుగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాదు.. మనీష్‌శర్మ ఆషిఖీ ఫ్రాంచైజీ సినిమాలు, సయ్యారాలకు భిన్నంగా ఒక కొత్తదనం నిండిన స్క్రిప్టుతో మెప్పించాల్సి ఉంటుంది. దర్శకుడిగా ఇది అతడికి సవాల్ లాంటిది.సారా అర్జున్ బాలనటిగా తమిళం, తెలుగు చిత్రాలలో నటించింది. తమిళ దర్శకుడు విజయ్ తెరకెక్కించిన నాన్న చిత్రంతో తెలుగులోను సుపరిచితం. అప్పట్లో క్యూట్ లుక్స్ తో బాలనటిగా ఆకట్టుకుని, ఆ తర్వాత యుక్తవయసులో రణ్ వీర్ సింగ్ లాంటి సీనియర్ ఏజ్డ్ హీరో సరసన కథానాయికగా నటించడంతో విమర్శలు ఎదురయ్యాయి. కానీ దురంధర్ సక్సెస్ ముందు విమర్శలేవీ నిలబడలేదు. చివరికి సారా అద్భుతంగా నటించిందని ప్రశంసలు దక్కాయి. అందుకే ఇప్పుడు మ్యూజికల్ లవ్ స్టోరీలో తన పాత్ర ఎలా ఉండబోతోందో చూడాలనే క్యూరియాసిటీ నెలకొంది.



ఉత్కంఠ రేపుతున్న 'నాట్ ఎ మహాత్మా'..

కేసీఆర్ దీక్షపై ఏం చూపించబోతున్నారు?



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన ఘట్టం 2009 నాటి ఆమరణ నిరాహార దీక్ష. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఈ దీక్ష నేపథ్యంతో 'నాట్ ఎ మహాత్మా' పేరుతో ఒక డాక్యుమెంటరీ వెబ్ సిరీస్ రాబోతోంది. తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.
అహింసా మార్గంలో మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధిస్తే, అదే పంథాలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని పోలుస్తూ, ఆ చారిత్రక దీక్ష వెనుక అసలు నిజం ఏంటి? అనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించినట్టు మేకర్స్ చెబుతున్నారు. నాలుగు ఎపిసోడ్లుగా రానున్న ఈ డాక్యుమెంటరీలో 2009 నాటి వాస్తవాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది.'ఓయ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన ఆనంద్ రంగ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, నాటి రాజకీయ పరిణామాలను లోతుగా విశ్లేషిస్తూ ఈ సిరీస్‌ను ఆసక్తికరంగా మలిచినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'అనగనగా ఫిల్మ్ కంపెనీ' బ్యానర్‌పై పట్టాభి ఆర్ చిలుకూరి నిర్మించిన ఈ సిరీస్‌కు ముత్యాల సుధీర్ రెడ్డి సహ-దర్శకుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ ట్రైలర్, తెలంగాణ చరిత్రలోని ఈ కీలక అధ్యాయంపై ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతోంది.



'ఆకాశంలో ఒక తార' కు చిరు ప్రశంసలు

'ఆకాశంలో ఒక తార' చిత్రంపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా తన మనసును ఎంతో కదిలించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా చిరంజీవి ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. ఇంతటి స్ఫూర్తిదాయకమైన కథను ఎంతో నమ్మకంతో, అత్యద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు పవన్ సాధినేనిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యంగా సినిమా సెకండాఫ్ తనను ఎంతగానో భావోద్వేగానికి గురిచేసిందని చిరంజీవి వివరించారు.చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించిన దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి తమ సహజ సిద్ధమైన నటనతో పాత్రలకు ప్రాణం పోశారని మెగాస్టార్ కొనియాడారు. అలాగే శ్రుతి హాసన్, రుహానీ శర్మతో పాటు ఇతర నటీనటులందరూ తమ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణుల పనితీరును ప్రస్తావిస్తూ.. జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ కథలోని భావోద్వేగాలను మరింత లోతుగా ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా చేశాయని అభినందించారు. చిత్రంలోని ప్రతి సాంకేతిక విభాగం పనితీరు ఎంతో అభినందనీయంగా ఉందని చెప్పారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com